ప్లాస్టిక్ వాడొద్దు

- వ్యాపారులకు 12 రోజులు గడువు
- 13వ రోజు నుంచి తనిఖీ
- భారీ జరిమానా
- జేసీ రాహుల్‌కుమార్ రెడ్డి హెచ్చరిక

భీమవరం టౌన్, సెప్టెంబరు 25: పట్టణంలో ప్లాస్టిక్ వాడకం తగ్గించడానికి అధికారులు చర్యలు చేపట్టారు. మునిసిపాల్టీ పరిధిలో 120 మైక్రాన్ల కంటె తక్కువ మందం ఉన్న ప్లాస్టిక్ వాడకంపై నిషేధం ఉందని, వ్యాపారులు, వినియోగదారుల ప్లాస్టిక్ వాడకం తగ్గించుకోవాలని జాయింట్ కలెక్టర్ టి రాహుల్ కుమార్ రెడ్డి హెచ్చరించారు. పట్టణ పరిధిలో పారిశుధ్యం, ఘన వ్యర్థాల నిర్వహణపై ప్రజారోగ్య సిబ్బందితో బుధవారం సమీక్ష నిర్వహించారు. నిబంధనలకు విరుద్ధంగా సింగిల్ యూస్ ప్లాస్టిక్, 120 మైక్రాన్ల కన్నా తక్కువ మందం కలిగిన ప్లాస్టిక్ వినియోగించిన వారికి జరిమానా విధించాలన్నారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ తయారీ, విక్రయదారులే వ్యర్థాల పునర్వినియోగం చేయడం లేదా శాస్త్రీయ పద్ధతిలో వాటిని ప్రొసెస్ చేయడంలో ప్రథమ బాధ్యతను కలిగి ఉండాలన్నారు. రానున్న 12 రోజుల్లోపు పట్టణంలో దుకాణదారుల నుంచి వచ్చే ప్లాస్టిక్ వ్యర్థాలను వారి ద్వారానే పునర్వినియోగం లేదా ప్రొసెస్ చేసుకునేవిధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. లేని పక్షంలో తదుపరి రోజు నుండి అధికారులు తనిఖీలు జరిపి నిబంధన విరుద్ధంగా ప్లాస్టిక్ వ్యర్థాలను కలిగి ఉన్న వారిపై భారీ జరిమానాల విధిస్తామన్నారు. దుకాణ లైసెన్సు కూడా రద్దు చేస్తామని హెచ్చరించారు. సెక్షన్‌ల వారీగా జేసీ సమీక్షించారు. సమావేశంలో మునిసిపల్ కమిషనర్ కె.రామచంద్రారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మ

దీన్‌దయాళ్ యువతకు ఆదర్శం

కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మ నివాళి

భీమవరంటౌన్, సెప్టెంబరు 25: దీన్ దయాళ్ ఉపాధ్యాయ యువతకు ఆదర్శమని కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ అన్నారు. బీజేపీ జిల్లా కార్యాలయంలో దీన్‌దయాళ్ జయంతి కార్యక్రమం బుధవారం నిర్వహించారు. శ్రీనివాసవర్మ ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఇటువంటి వ్యక్తులను నేటి తరం ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కాయిత సురేంద్ర, పేరిచర్ల సుభాష్, అల్లూరి సాయి దుర్గరాజు, కోమటి రవి, వబిలిశెట్టిప్రసాద్, షేక్ మోహిద్దీన్, పితాని వెంకటేశ్వరరావు, అడ్డగర్ల ప్రభాకర గాంధీ, లంకాలక్ష్మీ, సుష్మ, అందే త్రిమూర్తులు, తదితరులు పాల్గొన్నారు.



సాగునీటి సంఘాలకు పునరుజ్జీవం

జిల్లాలో సాగు విస్తీర్ణం.. సంఘాల పరిధి వివరాల సేకరణ.. అధికారుల కసరత్తు

ఎన్నికల్లో ఇచ్చిన హామీకి అనుగుణంగా కూటమి ప్రభుత్వం వంద రోజుల్లో సాగునీటి సంఘాల పునరుజ్జీవానికి చర్యలు చేపట్టింది. సంఘాలకు ఎన్నికల నిర్వహణ అంశాలు, కొత్తగా ఓట్ల నమోదు చేపట్టాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇరిగేషన్ అధికారులు సాగునీటి ఎన్నికల నిర్వహణకు రంగం సిద్ధం చేస్తున్నారు. సాగునీటి సంఘాలు, డిస్ట్రిబ్యూటరీ కమిటీల పరిధి, పెరిగిన సాగు విస్తీర్ణం, రైతుల సంఖ్య తదితర వివరాల సేకరణకు అధికారులు చర్యలు చేపడుతున్నారు. మొత్తం ప్రక్రియ పూర్తి చేసి అధికారులు 90 రోజుల్లో నివేదిక అందజేయాలని ప్రభుత్వం నిర్దేశించింది. ఈ నివేదికపై ప్రభుత్వం సమీక్షించి సాగునీటి సంఘాల ఎన్నికలు చేపట్టనుంది. తొమ్మిదేళ్ల తరువాత ప్రభుత్వం ఎన్నికలు నిర్వహించనుండడంతో రైతుల్లో ఆనందోత్సాహాలు వ్యక్తమవుతున్నాయి.

- రైతు ఓటర్ల నమోదుపై అధికారులకు ప్రభుత్వం దిశా నిర్దేశం
- ఆయకట్టు వివరాల సేకరణపై ఆదేశాలు
- 90 రోజుల్లో పూర్తి చేయాలని ఉత్తర్వులు
- అనంతరం ఎన్నికల నిర్వహణ
- రంగంలో దిగిన అధికారులు
- రైతుల్లో ఆనందోత్సాహాలు

నరసాపురం, సెప్టెంబరు 25: సాగునీటి పంపిణీలో రైతులను భాగస్వాయం చేసిన ఘనత టీడీపీకే దక్కుతుంది. ఉమ్మడి రాష్ట్రంలోనే సాగునీటి సంఘాలను ఏర్పాటుచేసి ఏటా ఆ సంఘాల పరిధిలో కాల్వలు, లాకులు, డ్రెయినేజీల ఆధునీకరణ పనులు చేపట్టేది. రాష్ట్ర విభజన తరువాత 2015లో నీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించింది. తర్వాత వైసీపీ ప్రభుత్వం సాగునీటి సంఘాలను నిర్వీర్యం చేసింది. గడచిన ఐదేళ్లలో ఇరిగేషన్ వ్యవస్థను అస్తవ్యస్తం చేసింది. డ్రెయినేజీల్లో కనీసం పూడికతీత కూడా చేపట్టలేదు. లాకుల మరమ్మతు, పంట కాల్వల ఆధునీకరణ ఊసేలేదు. దీంతో జిల్లాలో చాల చోట్ల రైతులు స్వచ్ఛందంగా పంట విరామం ప్రకటించారు. మరికొన్ని చోట్ల కొద్దిపాటి వర్షాలకే డ్రెయినేజీలు పొంగి రైతులు నష్టాల బారిన పడ్డారు. నీటి సంఘాలు లేకపోవడంతో కాల్వ పరివేక్షణ కొరవడింది. శివారు ప్రాంతాలకు నీరందని పరిస్థితి నెలకొంది. ఈనేపథ్యంలో ప్రభుత్వం నీటి సంఘాలకు ఊపిరి పోయాలని నిర్ణయించి ఎన్నికల నోటిఫికేషన్ జారీ చేసింది.

సంఘాలు ఎన్నికలు జరిగేదిలా...

సాగునీటి సంఘాల మూడు అంచెలుగా ఉంటాయి. మొదట నీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహిస్తారు. ప్రతి సంఘంలో ఆరుగురు డైరెక్టర్లు ఉంటారు. వారు అధ్యక్షుడు, ఉపాధ్యక్షులను ఎన్నుకుంటారు. మిగిలిన నలుగురు డైరెక్టర్లుగా కొనసాగారు. వీరి పరివేక్షణలో అ ఛానల్స్ పరిధిలో అభివృద్ధి పనులు కొనసాగుతాయి.

డిస్ట్రిబ్యూటరి, ప్రాజెక్టు కమిటీలు..

నీటి సంఘాల అధ్యక్ష, ఉపాధ్యక్షులు డిస్ట్రిబ్యూటరీ కమిటీలను ఎన్నుకుంటారు. గతంలో పశ్చిమ డెల్టాలో 20 మంది డీసీలు ఉన్నారు. ప్రతి డీసీ కమిటీలో ఒక అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడు ఉంటారు. 130 నీటి సంఘాల ఆధ్యక్ష, ఉపాధ్యక్షులు మొత్తం 20 డీసీ అధ్యక్షులు, ఉపాధ్యక్షులను ఎన్నుకుంటారు. ఎన్నికైన 20 మంది డీసీ అధ్యక్షులు కలిసి జిల్లా ప్రాజెక్టు కమిటీ ఛైర్మన్, ఉపాధ్యక్షుడు, నలుగురు డైరెక్టర్లను ఎన్నుకుంటారు. వారి పరివేక్షణ పశ్చిమ డెల్టా కమిటీ పని చేస్తుంది.

డెల్టా ప్రాజెక్టు కమిటీ పరిధిలో డ్రెయినేజీలు

జిల్లాలోని డ్రెయినేజీ వ్యవస్థ కూడా డెల్టా ప్రాజెక్టు కమిటీ పరివేక్షణలో ఉంటుంది. జిల్లాలో నాలుగు డ్రెయినేజీ సబ్ డివిజన్లు ఉన్నాయి. ప్రతి సబ్ డివిజన్‌కు ఒక డిప్యూటీ ఇంజనీర్ ఉంటారు. ప్రధాన ఆఫీస్ భీమవరంలో ఉంది. ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పర్యవేక్షణలో డ్రెయినేజీల పనులు చేపడతారు. జిల్లాలో మేజర్ డ్రెయిన్ల విషయానికి వస్తే గొంతేరు, ఎర్ర కాల్వ, తమ్మిలేరు, కాజ, కుక్కులేరు, మొగల్తూరు తదితర డ్రెయినేజీలు ఉన్నాయి. ఇవి కాకుండా మీడియం, మైనర్ డ్రెయినేజీలు కూడా ఉన్నాయి. నీటి సంఘాల పరిధిలో మైనర్ డ్రెయినేజీలు ఉంటాయి.

90 రోజుల్లో ఎన్నికల ప్రక్రియ

సాగునీటి ఎన్నికల నిర్వహణకు సంబంధించిన ప్రక్రియ 90 రోజుల్లో పూర్తి చేయాలని ప్రభుత్వ లక్ష్యం. 2015లో నీటి సంఘాలకు ఎన్నికలు జరిగాయి. టీడీపీ హయాంలో ఈ సంఘాలు రైతులకు సేవలందించాయి. గడిచిన ఐదేళ్ల ఎన్ని కలు నిర్వహించకపోవడంతో ఇరిగేషన్, డ్రెయినేజీల ఆధికారుల పర్యవేక్షణ లోనే కాల్వల నిర్వహణ సాగింది. కొత్తగా సాగు విస్తీర్ణం కూడా పెరిగింది. ఈనేపథ్యంలో ప్రభుత్వం ఆయకట్టు పరిధిలోని రైతులను గుర్తించి ముందుగా ఎన్నికలకు ఓటర్ల జాబితా సిద్ధం చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. అనంతరం అభ్యంతరాలు పరిశీలించి తుది జాబితా ప్రకటించిన తరువాత సంఘాల ఎన్నికలకు నోటిఫికేషన్ జారీ చేయడానికి కసరత్తు చేస్తున్నారు. ఈ ప్రక్రియను 90 రోజుల్లో పూర్తి చేయాలని సూచించింది.

పశ్చిమ డెల్టా కమిటీ

ధవళేశ్వరం బ్యారేజ్ నుంచి వచ్చే నిడదవోలు పంట కాల్వ ద్వారా అందే నీరు జిల్లాలో వ్యవసాయ సాగుకు ప్రధాన ఆధారం. ఈ కాల్వ పరిధిలో నీటి సంఘాన్ని పశ్చిమ డెల్టా కమిటీగా నిర్దేశించారు. ఈ కమిటీ పరిధిలో 130 నీటి సంఘాలు, జిల్లాలో 20 డిస్ట్రిబూటర్ కమిటీలు, ఒక ప్రాజెక్టు కమిటీ ఉన్నాయి. పంట విస్తీర్ణం బట్టి వాటర్ యూజర్స్ అసోసియేషన్ (నీటి సంఘాలు)లను ఏర్పాటు చేశారు. కొన్ని ప్రాంతాల్లో 2వేల ఎకరాలకు కూడా ఒక సాగునీటి సంఘం ఉంది. ప్రధాన పంట కాల్వ పరిధిలో కాకరపర్రు, బ్యాంకు కెనాల్, నరసాపురం, అత్తిలి, జీఎన్‌వి కెనాల్, జీవీ కెనాల్, ఏలూరు కెనాల్ వంటి మేజర్ పంట కాల్వలు ఉన్నాయి. ఇవి కాకుండా మరో 150పైగా సబ్ ఛానల్స్ ఉన్నాయి. వాటిలో చించినాడ, జిన్నూరు, రాపాక, మొగల్తూరు, రామన్నపాలెం, వేములదీవి వంటి మైనర్ కెనాల్స్ ఉన్నాయి. మేజర్ కాల్వలను ప్రాజెక్టు కమిటీ పరివేక్షిస్తే మీడియం ఛానల్స్‌ను డిస్ట్రిబూటరీ కమిటీ, మైనర్ ఛానల్స్ నీటి సంఘాల పరివేక్షణలో ఉంటాయి. ఈ ఛానల్స్‌లో చేపట్టాల్సిన పనులను నిడదవోలు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పర్యవేక్షిస్తారు.

సాగు నీటి సంఘాలతో రైతుల కష్టాలు తీరినట్లే

వైసీపీ ప్రభుత్వ పాలనలో నీటి సంఘాలు అస్తవ్యస్తమయ్యాయి. కాల్వల్లో తట్ట మట్టి కూడా తీయలేదు. గుర్రపుడెక్క, తూడు పేరుకుపోవడంతో భూములకు నీరందలేదు. వరదల సమయంలో డ్రెయిన్లలో నీటి ప్రవాహం స్తంభించి చేలు ముంపు బారిన పడ్డాయి. అధికారుల పర్యవేక్షణ కొరవడడంతో జిల్లాలో సాగు విస్తీర్ణం కూడా తగ్గింది. ప్రస్తుతం నీటి సంఘాలకు పునరుజ్జీవం పోయాలని ప్రభుత్వం నిర్ణయించడంతో రైతుల్లో ఆనందోత్సహం వ్యక్తమవుతుంది. సంఘాలకు ఎన్నికల ప్రక్రియ పూర్తయితే ఎక్కడ ఏ పని చేపట్టాలనే స్పష్టత ఉంటుంది. రైతులకు సాగునీటి సంబంధ సమస్యలు త్వరితగతిన పరిష్కారమవుతాయి



\- పొత్తూరి రామరాజు, డెల్టా ప్రాజెక్టు కమిటీ మాజీ ఛైర్మన్



కేడర్ డీలా

- తొలి జాబితా నామినేటెడ్ పదవులపై అసంతృప్తి
- ఆన్‌లైన్ అభిప్రాయ సేకరణలో కుండబద్దలు కొట్టిన పార్టీ శ్రేణులు
- తాడేపల్లిగూడెం నియోజకవర్గంలో 25 ఏళ్లుగా ప్రాతినిధ్యం కల్పించలేదని ఆవేదన
- టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జికి సముచిత పదవి కేటాయించాలని కార్యకర్తల మనోగతం

(భీమవరం-ఆంధ్రజ్యోతి)

కూటమి ప్రభుత్వం రాష్ట్రస్థాయి కార్పొరేషన్ ఛైర్మన్‌లుగా జిల్లాకు రెండు పదవులు ఇచ్చింది. జిల్లాకు సముచిత ప్రాధాన్యం లభించినా తాడేపల్లిగూడెం నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీకి తొలి జాబితాలో స్థానం లభిస్తుందని కేడర్ ఆశించింది. నియోజకవర్గ ఇన్‌చార్జికి మంచి పదవి ఇస్తారని అంతా భావించారు. తొలి జాబితాలో తాడేపల్లిగూడెం నియోజకవర్గానికి పదవి లేకపోవడంతో కేడర్ డీలా పడింది. కార్పొరేషన్ పదవులపై కూటమి ప్రభుత్వం మొబైల్ ఫోన్‌లలో ఆరాతీసింది. పార్టీ శ్రేణుల్లో సంతృప్తి స్థాయిపై ఆరా తీసింది. తాడేపల్లిగూడెం నియోజకవర్గం నుంచి క్రియాశీల కార్యకర్తలకు ఫోన్ రావడంతో అసంతృప్తిని వెళ్లగక్కారు. నియోజకవర్గ ఇన్‌చార్జి వలవల బాబ్జికి ప్రాంతీయ పదవి ఇస్తారంటూ లీకులు రావడంతో బాబ్జి సున్నితంగా తిరస్కరించారు. అటువంటి పదవి తీసుకుంటే తాడేపల్లిగూడెం నియోజకవర్గంలో పార్టీ ఇమేజ్ దెబ్బతింటుందని అధిష్ఠానం దృష్టికి తీసుకువెళ్లే ప్రయత్నాలు చేశారు. దీనితో తొలి విడతలో బాబ్జికి చోటు ఇవ్వకుండా వాయిదా వేసిందన్న వాదన వినిపిస్తోంది. తొలి నుంచి నియోజకవర్గ ఇన్‌చార్జి బాబ్జికి కేటాయిస్తారన్న కార్పొరేషన్‌ను జనసేనకు ఇచ్చారు. సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ పదవి ఇస్తారంటూ కేడర్‌లో ముమ్మరంగా ప్రచారం సాగింది. జనసేన నేతకు ఆ పదవిని కేటాయించారు. వాస్తవానికి గడచిన 25 ఏళ్ల నుంచి తాడేపల్లిగూడెం నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీకి ప్రాతినిధ్యం లేదు. గెలుపు అవకాశాలున్న రెండు పర్యాయాలు తెలుగుదేశం పొత్తులో భాగస్వామ్య పార్టీలకు కేటాయించింది. గడచిన ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీకి సీటు ఇస్తారంటూ ఆ పార్టీ బలమైన నమ్మకంతో ఉండేంది. పొత్తు సమీకరణల్లో జనసేనకు కేటాయించారు. అధిష్ఠానం ఈ సారి తెలుగుదేశానికే తాడేపల్లిగూడెం టిక్కెట్ ఇస్తామంటూ గట్టిగా హామీ ఇచ్చింది. బాబ్జికి ఆ దిశగా భరోసా ఇచ్చినా పొత్తులో ఇవ్వలేకపోయారు. అయినప్పటికీ జనసేన విజయానికి బాబ్జి ఆధ్వరంలో తెలుగుదేశం శ్రేణులు కృషి చేశాయి. సీటు ఇవ్వలేకపోయినా సరే బాబ్జికి కార్పొరేషన్‌తోపాటు, ఎమ్మెల్సీ కూడా ఇస్తామంటూ టీడీపీ అధిష్ఠానం హామీ ఇచ్చింది. తొలి విడతలోనే పదవి కేటాయిస్తారంటూ కేడర్ గట్టి నమ్మకంతో ఉండేది. ఇప్పుడు కూడా అధిష్ఠానం తమ ఆకాంక్షలను నెరవేర్చలేకపోయిందని కేడర్ కాస్త అసంతృప్తికి లోనయింది. కార్పొరేషన్ పదవుల జాబితా విడుదల తర్వాత సంతృప్తి స్థాయిపై ఆరా తీస్తే తాడేపల్లిగూడెం పార్టీ శ్రేణుల్లో అసంతృప్తి స్పష్టంగా వెల్లడైంది. మున్ముందు ఇదే ఒరవడి సాగితే కేడర్‌లో ఆత్మవిశ్వాసం సన్నగిల్లిపోతుందంటూ నియోజకవర్గ నాయకత్వంలో ఆందోళనతో ఉంది.



అమృత్‌కు మోక్షం

- పురోగతిలో ప్రాజెక్టులు, డీపీఆర్‌లు సిద్ధం
- టెండర్ దశలో పనులు
- తాగునీరు, ఎస్‌టీపీలకు ప్రాధాన్యం

భీమవరం టౌన్, సెప్టెంబరు 25: కేంద్రం అమలు చేస్తున్న అమృత్ పథకం అమలు వేగవంతమవుతోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత జిల్లాలో పలు ప్రాజెక్టులు టెండర్ల దశకు చేరాయి. ప్రస్తుతం పట్టణాల్లో అమృత్-2.0 పథకం అమలు జరుగుతోంది. జిల్లాలోని అన్ని మునిసిపాల్టీలకు రూ 286.54 కోట్ల నిధులు కేటాయించారు. గతంలో తెలుగుదేశం ప్రభుత్వ హయాంలోనే అమృత్ 2.0 అమలు కాగా తర్వాత వైసీపీ పాలనలో పూర్తిగా నిర్లక్ష్యం చేశారు. తిరిగి కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే అప్పటి ప్రాజెక్టులన్నీ తెరపైకి వచ్చాయి. నివేదికలు సిద్ధం చేయడంతో ప్రస్తుతం టెండర్ల దశలో ఉన్నాయి. మరికొన్ని పనులకు సాంకేతిక అనమతి రాగానే టెండర్లు పిలవనున్నారు. జిల్లాలో భీమవరం, తాడేపల్లిగూడెం, తణుకు, పాలకొల్లు, నరసాపురం, ఆకివీడు మునిసిపాల్టీలలో అమృత్ పథకం అమలు జరుగుతోంది.

తాగునీటికి ప్రాధాన్యం

అమృత్ పథకంలో తాగునీటికి అధిక ప్రాధాన్యం ఇచ్చారు. కొత్తపైపులైన్‌లు, ఓహెచ్‌ఆర్ ట్యాంకులు, వంటి పనులను చేపట్టనున్నారు. జిల్లాలోని అన్ని మునిసిపాల్టీలలో తాగునీటి వసతులను మెరుగుపరచేందుకు ప్రణాళిక సిద్ధం చేశారు. సమృద్ధిగా మంచినీరు ఇచ్చే సంకల్పంతో అమృత్ నిధులను వినియోగిస్తున్నారు. భీమవరం, తాడేపల్లిగూడెం మునిసిపాల్టీలలో ట్రీట్‌మెంట్ ప్లాంట్‌ల నిర్మాణానికి అమృత్ నిధులు వెచ్చిస్తున్నారు. ముఖ్యంగా తాడేపల్లిగూడెంలో భూగర్భ డ్రెయినేజీ గత 15 ఏళ్లుగా పెండింగ్‌లో ఉంది. పూర్తి చేయడానికి రూ. 100.20 కోట్లు మంజూరు చేశారు. మరోవైపు రూ41.00 కోట్లతో రెండో సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు నిర్మాణానికి టెండర్లు ఖరారయ్యాయి. ఏజెన్సీ పనులు చేపట్టగానే వేగవంతం కావడానికి టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేశారు. ఫలితంగా ఆ పనులను ఎప్పటికప్పుడు సమీక్షించి పూర్తిచేసేలా ప్రభుత్వం దృష్టిపెట్టింది.

కేంద్రం ఇచ్చేది 50 శాతమే

కేంద్ర ప్రభుత్వం అమృత్ 2.0లో 50శాతం నిధులు మాత్రమే ఇవ్వనుంది. మరో 30 శాతం రాష్ట్ర ప్రభుత్వం భరిస్తుంది. మిగిలిన 20 శాతం నిధులను మునిసిపాల్టీలు సమకూర్చుకోవాల్సి ఉంది. జిల్లాలో భీమవరం మునిసిపాల్టీమాత్రమే నిధులు సమకూర్చుకునే స్థితిలో ఉంది. మిగిలిన మునిసిపాల్టీలకు ప్రభుత్వమే ఆదుకోవలసి ఉంది. లేకుంటే అమృత్ 2.0 పనులు ముందుకు వెళ్లే అవకాశం లేదు.

పేదల కాలనీలకు మంచినీరు

కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి ఆవాస యోజనలో మంజూరు చేసిన పేదల ఇళ్ల కాలనీలకు కూడా మంచినీరు వసతిని కల్పించేందుకు అమృత్ 2.0 నిధులు కేటాయించారు. ఆ పనులు కూడా టెండర్ల దశకు చేరుకున్నాయి. సమగ్ర ప్రాజెక్ట్ నివేదికలు సిద్ధమవుతున్నాయి. త్వరలో టెండర్ల పక్రియ చేపట్టి పనులు ప్రారంభించడానికి చర్యలు చేపడుతున్నారు.

అమృత్ నిధులు మంజూరు ఇలా

మునిసిపాల్టీ	పనితీరు రూ.కోట్లలో	నిధులు	ప్రస్తుత దశ
ఆకివీడు	నీటిసరఫరా	5.92	టెండర్లు
ఆకివీడు	నీటిసరఫరా	26.50	టెండర్లు
నరసాపురం	తాగునీటి సరఫరా	21.00	టెండర్ల
భీమవరం	తాగునీటి సరఫరా	47.29	టెండర్లు
తాడేపల్లిగూడెం	తాగునీటి సరఫరా	41.79	పురోగతిలో పనులు
తణుకు	తాగునీటి సరఫరా	8.36	సాంకేతిక అనుమతి మంజూరు
భీమవరం	లే-అవుట్	4.80	టెండర్ల దశ
తాడేపల్లిగూడెం	తాగునీటిసరఫరా	5.10	టెండర్ల దశ
భీమవరం	ఎస్‌టీపీ	11.39	టెండర్ల దశ
తాడేపల్లిగూడెం	లే- అవుట్ ఎస్‌టీపీ	12.19	టెండర్ల దశ
తాడేపల్లిగూడెం	భూగర్భడ్రెయినేజీ ఎస్‌టీపీ,	100.20	టెండర్ల దశ



పూజలు నిర్వహిస్తున్న అర్చకులు
ప్రత్యేక అలంకరణలో స్వామివారు

కాళ్ళకూరు వెంకన్న ఆలయంలో పవిత్రోత్సవాలు

కాళ్ళ, సెప్టెంబరు 25: కాళ్ళకూరు వేంకటేశ్వరస్వామి ఆలయంలో బుధవారం సాయంత్రం 6గంటలకు సప్తనదీ జలాభిషేక పూర్వక పవిత్రోత్సవ కార్యక్రమాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. కాండూరి వెంకట రమణాచార్యుల ఆధ్వర్యంలో వేదమంత్రాల నడుమ పూజలు నిర్వహించారు. ముందుగా స్వామివారికి విశ్వక్సేన పూజ, భగవత్ పుణ్యాహవాచన, దీక్షాధారణ, అంకురార్పణ, నీరాజన మంత్రపుష్పములు, తీర్థగోష్ఠి ఘనంగా జరిపారు. భక్తులు విశేష సంఖ్యలో స్వామివారికి దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లను దేవస్థానం ఈవో ఎం అరుణ్‌కుమార్, సిబ్బంది పర్యవేక్షించారు.

ఎక్సైజ్‌శాఖలో బదిలీలు

మాతృ సంస్థలో అధికారులకు పోస్టింగులు

14 మంది డిప్యూటీ కమిషనర్లకు స్థానచలనం

సీబీఐ పోలీసులమని బెదిరించి తొమ్మిది లక్షలు లాగేశారు

ఏలూరులో మోసపోయిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి

7



వెంకట్రావుపాలెంలో ధాన్యం సంచుల్లో పడుతున్న రైతులు

అన్నదాతకు ఊరట

ధాన్యం కొనుగోలు మిల్లును రైతు ఎంపిక చేసుకోవచ్చు

మద్దతు ధర రూ.100 పెంపు

తాడేపల్లిగూడెం రూరల్, సెప్టెంబరు 25: ధాన్యం కొనుగోలులో అన్నదాతకు ఊరట లభించింది. గతంలో రైతు ధాన్యం తూయాల్సిన మిల్లు ఆన్‌లైన్‌లో ఎలాట్ చేసేవారు. 30 కిలోమీటర్ల ఆవల ఉండే మిల్లుకు ధాన్యం తూచేందుకు రైతులు ఇబ్బంది పడేవారు. అక్కడ జట్టు లేకపోయినా ఆన్‌లైన్ సర్వర్ పనిచేయకపోయినా రైతులు వారి ధాన్యం కాపాడుకునేందుకు ఇబ్బందులు పడేవారు. కూటమి ప్రభుత్వం ఆ సమస్య పరిష్కరించేందుకు రైతులు ఏ మిల్లుకు ధాన్యం తరలించాలో ఎంచుకునే అవకాశం ఇచ్చారు. దీంతో సమీపంలోని మిల్లుకు తరలించుకోవడంతోపాటు వారికి కావాల్సిన సంచులు కూడా వారే త్వరగా తెచ్చుకునేందుకు వీలుదొరికింది.

ధాన్యంమద్దతు ధర పెంపు

గతంలో కంటే ధాన్యం మద్దతు ధరను ప్రభుత్వం వంద రూపాయలు పెంచుతూ నిర్ణయం తీసుకుంది. గతంలో ఎ గ్రేడు మద్దతు ధర రూ.2230 కాగా ప్రస్తుతం రూ.2330కి పెరిగింది. దీంతోపాటు సాధారణ రకం రూ.2200 ఉండగా తాజాగా రూ.2300 ఇస్తున్నారు. ధాన్యం కొనుగోలు విషయంలో ప్రభుత్వ నిర్ణయంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సంచుల కోసం పడిగాపులు తప్పాయి

గతంలో ఆన్‌లైన్ ద్వారా మిల్లులను కేటాయించే విధానం వల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. రైతులకు కేటాయించిన మిల్లుల వద్ద సంచులు అందుబాటులో లేకపోతే రోజుల తరబడి ధాన్యం కళ్లాల్లోనే ఉంచారు. ఆ సమయంలో వర్షం పడితే రైతుల బాధలు వర్ణనాతీతం. ప్రస్తుతం రైతులే మిల్లులు ఎంపిక చేసుకునే అవకాశంతో రైతులకు అందుబాటులో ఉండే మిల్లుతోపాటు సంచులు ఇచ్చే మిల్లులకు ప్రాధాన్యం ఇవ్వచ్చు.

6.60లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం

జిల్లాలో మెట్టప్రాంతంలో వరికోతలు మొదలు కావడంతో 6.60లక్షల మెట్రిక్‌టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని వ్యవసాయాధికారులు అంచనా వేస్తున్నారు. ఆ ధాన్యం కొనుగోలు చేసేందుకు సివిల్ సప్లయిస్, వ్యవసాయ అధికారులు సమన్వయంతో ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.

ఆర్‌ఎస్‌కే సిబ్బందికి సాంకేతిక శిక్షణ

భీమవరం టౌన్, సెప్టెంబరు 25: ధాన్యం కొనుగోలుకు రైతు సేవా కేంద్రాలలో (ఆర్‌ఎస్‌కే) సిబ్బందికి సాంకేతిక శిక్షణ ఇవ్వనున్నట్లు జేసీ టి.రాహుల్ కుమార్ రెడ్డి తెలిపారు. కలెక్టరేట్‌లోని జేసీ ఛాంబర్‌లో ఖరీఫ్ సీజన్ 2024-25 ధాన్యం కొనుగోలు సన్నద్ధతపై జిల్లా కమిటీ సభ్యులతో బుధవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఖరీఫ్ ధాన్యం అమ్మడానికి రైతులకు వారికి నచ్చిన రైస్ మిల్లును ఎంపిక చేసుకునే అవకాశం కల్పించామన్నారు. రైతు సేవా కేంద్రాలు ధాన్యం కొనుగోలు కేంద్రాలుగా కూడా పనిచేస్తాయని, రైతు సమక్షంలో వారి గ్రామంలోనే రైతు సేవా కేంద్రాల ద్వారా ధాన్యం మద్దతు ధరకు విక్రయించుకోవచ్చని తెలిపారు. డివిజనల్ స్థాయిలో గురువారం భీమవరం ఎస్‌ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాల ఆవరణలో సాంకేతిక శిక్షణ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. 27న తాడేపల్లిగూడెం, 28న నరసాపురం డివిజన్‌లోని ఆర్‌ఎస్‌కే సిబ్బందికి శిక్షణ తరగతులను నిర్వహిస్తామన్నారు. మొదటి విడత శిక్షణా తరగతులు పూర్తి చేయడంతో పాటుగా, తదుపరి మిగిలిన రెండు విడతలు కూడా వారి వారి మండల పరిధిలోనే శిక్షణ తరగతుల నిర్వహించనున్నట్లు తెలిపారు.

జాతీయ స్కాలర్‌షిప్ టెస్టుకు దరఖాస్తు తుది గడువు 3 వరకు పొడిగింపు

ఏలూరు అర్బన్/భీమవరం ఎడ్యుకేషన్ : సెప్టెంబరు 25 : డిసెంబరు 8న జరుగనున్న ఎన్‌ఎంఎంఎస్ పరీక్షకు దరఖాస్తు చేసుకునే తుదిగడువును అక్టోబరు 3 వరకు పొడిగించినట్టు ఏలూరు, పశ్చిమ గోదావరి జిల్లాల డీఈవోలు అబ్రహం, నాగరాణి ఓ ప్రకటనలో తెలిపారు. ప్రింటెడ్ నామినల్ రోల్స్, ఎస్‌బీఐ కలెక్ట్ రశీదు, స్కూల్ హెచ్‌ఎం లేఖను ఏలూరు డీఈవో కార్యాలయాల్లో అక్టోబరు 14 లోగా అందజేయాలని సూచించారు. ప్రభుత్వ, జిల్లాపరిషత్, మున్సిపల్, ఎయిడెడ్, మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలు, వసతి సౌకర్యం లేని ఆంధ్రప్రదేశ్ ఆదర్శ పాఠశాలలో 8వ తరగతి చదువుతూ కుటుంబ సంవత్సరాదాయం రూ.3.50 వేలు లోపు ఉన్న విద్యార్థులు అందరూ ఈ పరీక్ష రాసేందుకు అర్హులని తెలిపారు. ఓసీ, బీసీ విద్యార్థులకు పరీక్ష రుసుం రూ.100, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.50 చెల్లించాలన్నారు. పూర్తి వివరాలకు ప్రభుత్వ పరీక్షల సంచాలకుల కార్యాలయపు వెబ్ సైట్ www.bse.ap.gov.in లోగానీ లేదా జిల్లా విద్యాశాఖాధికారి వారి కార్యాలయంలో సంప్రదించాలని డీఈవో నాగమణి పేర్కొన్నారు.



ఎన్‌హెచ్‌ఆర్‌సీ చైర్‌పర్సన్ విజయభారతికి స్వామివారి చిత్రపటం అందిస్తున్న ఆలయ అధికారులు

శ్రీవారి సేవలో ఎన్‌హెచ్‌ఆర్‌సీ చైర్‌పర్సన్

ద్వారకాతిరుమల, సెప్టెంబరు 25: చినవెంకన్న ఆలయాన్ని జాతీయ మానవ హక్కుల కమిషన్ చైర్‌పర్సన్ విజయభారతి బుధవారం సందర్శించారు. ఆలయానికి విచ్చేసిన ఆమెకు ఆలయ అధికారులు, అర్చకులు ఆలయ మర్యాదలతో ఘన స్వాగతం పలికారు. స్వామి, అమ్మవార్లను దర్శించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ ముఖమండపంలో ఈమెకు అర్చకులు స్వామివారి శేషవస్త్రం, వేదాశీర్వచనం అందించారు. శ్రీవారి చిత్రపటం, ప్రసాదాలను అందుకున్నారు.


పలు రైళ్లు మళ్లింపు

ఏలూరు క్రైం, సెప్టెంబరు 25 : ఏలూరు -తాడేపల్లిగూడెం మీదుగా వెళ్ళే పలు రైళ్లను విజయవాడ నుంచి గుడివాడ, భీమవరం జంక్షన్, నిడదవోలు మీదుగా మళ్ళిస్తున్నామని అదే విధంగా రాజమండ్రి వైపు నుంచి ఏలూరు- తాడేపల్లిగూడెం మీదుగా వెళ్లాల్సిన రైళ్లను నిడదవోలు, భీమవరం టౌన్, గుడివాడ మీదుగా విజయవాడ వెళ్తాయని విజయవాడ సౌత్‌సెంట్రల్ రైల్వే అధికారులు తెలిపారు. రైల్ నెంబర్ 11019 ఛత్రపతి శివాజీ టెర్మినల్స్ - భువనేశ్వర్ ఈనెల 30వ తేదీ, వచ్చే నెల 2,4,5,7,9,11,12,14,16,18,19,21,23,25,26 తేదీలలో, ధన్‌బాగ్ -ఆల్‌ఫజ్(13351) ఈనెల 30వ తేదీ నుంచి అక్టోబరు 27 వరకూ, టాటా- యశ్వంత్‌పూర్(18111) అక్టోబర్ 3, 10, 17, 24 తేదీలు, జాసిద్-తాంబ్రం(12376) అక్టోబరు 2, 9, 16, 23 తేదీలు ,అట్వాయ్ - యర్నాకుళం(22837) ఈనెల 30 అక్టోబరు 7, 14, 21 తేదీల్లో మళ్లించనున్నట్టు తెలిపారు.

అథ్లెటిక్స్‌కు కైకరం నుంచి ఏడుగురు విద్యార్థుల ఎంపిక

ఉంగుటూరు, సెప్టెంబరు 25 : జిల్లా అథ్లెటిక్స్ అసోయేషన్ ఆధ్వర్యంలో జరిగిన పోటీలలో ఏడుగురు కైకరం హైస్కూలు విద్యార్థులు విజయం సాధించి రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు హెచ్‌ఎం గుళ్ళ ప్రసాదరావు తెలిపారు. కే.దీవెన కుమార్ (జావలిన్‌త్రో,లాంగ్ జంప్, షాట్‌పుట్, 60 మీటర్ల రన్నింగ్), జి.సందీప్ (రన్నింగ్, లాంగ్ జంప్, 600 మీటర్ల రన్నింగ్, సుభాష్, జి.యశ్వంత్, వై.ప్రేమ్ కుమార్ ఎం.ఆంజనేయస్వామి,బాలికల విభాగంలో మేరీ ఎంపికయ్యారని తెలిపారు. వీరు అక్టోబరు 3నుంచి 5వరకు రాజమహేంద్రవరంలో జరిగే పోటీల్లో పాల్గొంటారన్నారు.

ట్రిపుల్ ఐటీలో త్వరలో మెస్ టెండర్ల ఖరారు



విలేకర్లతో మాట్లాడుతున్న ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ ఎస్.అమరేంద్రకుమార్

నూజివీడు టౌన్, సెప్టెంబరు 25: నూజివీడు ట్రిపుల్ ఐటీలో త్వరలో మెస్ టెండర్లను ఖరారు చేసి నూతన క్యాటరర్లకు మెస్‌లను అప్పగించేందుకు చర్యలు చేపడుతున్నట్లు నూజివీడు ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ ఎస్.అమరేంద్ర కుమార్ చెప్పారు. ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఇటీవల నూజివీడు ట్రిపుల్ ఐటీలో నెలకొన్న మెస్ వివాదాల నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం త్రీమెన్ కమిటీ ఏర్పాటు చేసిందన్నారు. దీంతో నూజివీడు ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లో 6 వేల మందికి భోజన సదుపాయాలు అందించే ముగ్గురు క్యాటరర్లలో ఇద్దర్ని తొలగించామన్నారు. కేవలం ఒక్కరే ఆరు వేల మందికి భోజనం అందిస్తున్నారని సమస్యల పరిష్కారానికి నూతన టెండర్లను పిలిచి అక్టోబరు 3వ తేదీ లోపు నూతన క్యాటరర్లకు బాధ్యతలు అప్పగిస్తామన్నారు.ఎన్నికల కోడ్ నేపథ్యంలో టెండర్లు పిలవకపోవడం వల్ల సమస్య వచ్చిందన్నారు. అకడమిక్ క్యాలెండర్ రూపకల్పనకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఫుడ్ కోర్టు విషయంలో త్వరలో ఒక నిర్ణయం తీసుకుంటామన్నారు.ఏవో లక్ష్మణ్, పీఆర్వో సురేష్ తదితరులు పాల్గొన్నారు.



సీఎం చంద్రబాబుకు రూ.కోటీ 52 లక్షల చెక్ అందిస్తున్న తిరుమల విద్యా సంస్థల చైర్మన్ నున్న తిరుమలరావు, విద్యార్థినిలు

సీఎం రిలీఫ్ ఫండ్‌కు తిరుమల విద్యాసంస్థల నుంచి రూ.1.52 కోట్లు విరాళం

రాజమహేంద్రవరం రూరల్, సెప్టెంబరు 25 : తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం తిరుమల విద్యాసంస్థల చైర్మన్ తన విద్యాసంస్థల నుంచి సీఎం సహాయ నిధికి రూ.కోటి 52 లక్షలను అందించారు. బుధవారం సీఎం చంద్రబాబును కలిసి చెక్ అందజేశారు. విజయవాడ వరద బాధితుల సహాయార్థం తిరుమల విద్యాసంస్థల ఉద్యోగుల వేతనం నుంచి రూ.25,49,628, విద్యార్థులందరూ ఇచ్చిన రూ. 76,50,912 కలిపి మొత్తం రూ.కోటి రెండు లక్షలను సీఎంకు అందించారు. గతంలో రూ.50 లక్షలను అందించగా మొత్తం కోటి 52 లక్షలను సీఎం సహాయ నిధికి అందించారు. రెసిడెంట్ డైరెక్టర్లు కె.సత్యానారాయణ, ఎస్.సాయిరాజు, తదితరులు పాల్గొన్నారు.





జిల్లా జట్లకు ఎంపికైన విద్యార్థులతో పెదవేగి గురుకుల విద్యాలయ ప్రిన్సిపాల్ తదితరులు.. జిల్లా జట్టుకు ఎంపికైన అండర్-17 క్రీడాకారిణులు

ఉత్సాహంగా స్కూల్ గేమ్స్ ఎంపిక పోటీలు

పెదవేగిలో బేస్‌బాల్, సాఫ్ట్‌బాల్ జిల్లా జట్ల ఎంపిక

పెదవేగి, సెప్టెంబరు 25 : 14, 17 ఏళ్ల విభాగం ఉమ్మడి జిల్లాజట్లు ఎంపిక పెదవేగిలోని ఏపీ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయంలో బుధవారం నిర్వహించారు. 14, 17 ఏళ్ల విభాగంలో నిర్వహించిన సాఫ్ట్‌బాల్, బేస్‌బాల్ బాల, బాలికల జిల్లా జట్ల ఎంపిక పోటీలకు ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని వివిధ పాఠశాలల నుంచి 360 మంది హాజరయ్యారని, ప్రతిభ ఆధారంగా జిల్లా జట్లను ఎంపిక చేశామని గురుకుల విద్యాలయం ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరావు తెలిపారు. వ్యాయామోపాధ్యాయులు కె.జయ రాజు, నరసింహరాజా, వి.వెంకటేశ్వరరావు, ఎం.సుబ్బారావు, కె.విజయ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

గొరగనమూడిలో నెట్‌బాల్ జట్ల ఎంపికలు

పాలకోడేరు : గొరగన మూడి స్వామి జ్ఞానానంద హైస్కూల్ క్రీడా ప్రాంగణంలో ఉభయ గోదావరి జిల్లా స్కూల్‌గేమ్స్ అండర్ -14, అండర్ 17 బాల,బాలికల నెట్‌బాల్ జట్ల ఎంపికలు బుధవారం జరిగాయి. నెట్‌బాల్ పోటీలను హెచ్‌ఎం శ్రీదేవి అధ్యక్షతన ఎంపిటీసీ కృష్ణకుమారి, ఎంఈవో శివన్నారాయణలు ప్రారంభించారు. 120 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. జిల్లా స్కూల్ గేమ్స్ సెక్రటరీ మల్లేశ్వరరావు, అసోసియేషన్ చైర్మన్ కృష్ణారెడ్డి, జిల్లా నెట్‌బాల్ సెక్రటరీ దావూద్‌ఖాన్, గొరగనమూడి హైస్కూల్ పీడీ విజయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

కస్తూరిబా స్కూల్లో బాస్కెట్‌బాల్ జట్ల ఎంపిక

ఏలూరు అర్బన్ : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్జీఎఫ్) అండర్-14, 17 విభాగాల్లో బాలికల బాస్కెట్‌బాల్ జిల్లా క్రీడాజట్ల ఎంపికలు బుధవారం స్థానిక కస్తూరిబా మున్సిపల్ హైస్కూలులో జరిగాయి. ఒక్కో విభాగంలో నలుగురు స్టాండ్‌బై క్రీడాకారిణులతో సహా మొత్తం 16 మంది వంతున ఎంపికచేసినట్టు సెలక్షన్ కమిటీ ప్రతినిధులు వై.మురళీకృష్ణమ్మ, జి.శ్రీనివాసరావు తెలిపారు. అక్టోబరులో జరుగనున్న రాష్ట్రస్థాయి ఎస్జీఎఫ్ పోటీల్లో జిల్లా తరపున ఈ జట్లు ప్రాతినిధ్యం వహిస్తాయన్నారు.

రాష్ట్రస్థాయి సాఫ్ట్ బాల్‌కు గణపవరం విద్యార్థిని



గణపవరం : రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు గణప వరం జిల్లా పరిషత్ బాలు రున్నత పాఠశాల 9వ తరగతి విద్యార్థిని ఎం.హలణ్యాకోమలి ఎంపికైనట్లు పీడీ ఎం.పద్మా వతి తెలిపారు. పెదవేగిలో బుధ వారం నిర్వహించిన పోటీల్లో హలణ్యా కోమలి సెలక్షన్‌లో పాల్గొని అనంతపురంలో జరిగే పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు.



శనివారపుపేట సహకార సంఘంలో కంప్యూటరీకరణ ప్రక్రియను పరిశీలిస్తున్న జేసీ ధాత్రిరెడ్డి (ఫైల్)

సహకార సంఘాలకు.. మహర్దశ

» వేగవంతంగా సహకార సంఘాల కంప్యూటరీకరణ ప్రక్రియ

» జాతీయ నాబార్డ్ నెట్‌వర్క్‌తో జిల్లాలోని 158 పీఏసీఎస్‌లు అనుసంధానం

ఏలూరు సిటీ, సెప్టెంబరు 25 : జిల్లాలోని ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల్లో (సహకార సంఘాల్లో) కంప్యూటరీకరణ ప్రక్రియ త్వరిత గతిన కొనసాగుతోంది. జిల్లాలోని కంప్యూటరీకరణ ప్రక్రియకు కేంద్ర ప్రభుత్వం 60 శాతం నిధులు, రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం నిధులు కేటాయించాయి. జిల్లాలోని 159 పీఏసీఎస్‌ల కంప్యూటరీకరణకు నిధులు మంజూరయ్యాయి. పోలవరం మండలం పైడిపాక పీఏసీఎస్ తప్ప మిగిలిన 158 సహకార సంఘాల్లో రికార్డుల కంప్యూటరీకరణ ప్రక్రియ ప్రస్తుతం కొనసాగుతోంది. కలెక్టర్, జాయింట్ కలెక్టర్‌లు నిరంతర పర్యవేక్షణలో సహకార అధికారులు, జిల్లా సహకార కేంద్ర బ్యాంకు సిబ్బంది, పీఏసీఎస్‌ల సిబ్బంది యుద్ధప్రాతిపదికన సంఘాల రికార్డులు డిజిటలైజేషన్ చేయడంలో నిమగ్నమై ఉన్నారు. పూర్తి స్థాయిలో అక్టోబరు 2వ తేదీ (గాంధీ జయంతి రోజు) నుంచి కంప్యూటరీకరణ ద్వారా ఆన్‌లైన్‌లో లావాదేవీలు నిర్వహించడానికి వీలుగా కృషి చేస్తున్నారు.

అక్టోబరు 2 నాటికి నూరుశాతం కంప్యూటరీకరణ

ఎ.శ్రీనివాస్, జిల్లా సహకార అధికారి

జిల్లాలోని 158 పీఏసీఎస్‌లలో కంప్యూటరీకరణ ప్రక్రియ వేగవంతంగా జరుగుతోంది. అక్టోబరు 2వతేదీ నాటికి జిల్లాలోని సహకార సంఘాల్లో చేపట్టిన కంప్యూటరీకరణ పూర్తి చేయాలనే లక్ష్యంతో పనిచేస్తున్నాం. కంప్యూటరీకరణ పూర్తయితే ఆన్‌లైన్ సేవలు అందుబాటులోకి వస్తాయి. కంప్యూటరీకరణ ప్రక్రియను కలెక్టర్, జేసీ నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. అన్ని రికార్డులు కంప్యూటరీకరణ జరిగితే పారదర్శకత సాధ్యమవుతుంది.

దుర్వినియోగాలకు అడ్డుకట్ట వేయవచ్చు

పీఏసీఎస్‌లలో కంప్యూటరీకరణ వల్ల సహకార సంఘాల నిధుల దుర్వినియోగానికి అడ్డుకట్ట వేయవచ్చు. రైతులకు పారదర్శకంగా సేవలు అందించడానికి అవకాశం ఏర్పడుతుంది. కంప్యూటరీకరణలో భాగంగా ప్రతి పీఏసీఎస్‌కు ప్రభుత్వమే డెస్క్‌టాప్, వెబ్‌కామ్, మల్టీఫంక్షన్ డివైజ్ (ప్రింటర్) , ఫిజికల్ వీపీఎన్ డివైజ్, బయో మెట్రిక్ స్కానర్స్, ఇంటిగ్రేటెడ్ టాబ్లెట్ , యూపీఎస్, పీవోఎస్ మిషన్, బార్‌కోడ్ స్కానర్, బ్లూటూత్ థర్మల్ ప్రింటర్, పాస్ బుక్ ప్రింటర్ వంటి 11 రకాల హార్డ్‌వేర్‌లను సమకూరుస్తోంది. ఈ హార్డ్‌వేర్ ఐటెమ్స్ ద్వారా డెస్క్‌టాప్, ఇంటిగ్రేటెడ్ టాబ్, పీవోఎస్ మిషన్‌ల ద్వారా మూడు రకాల బ్యాంకింగ్ టచ్ ప్రింక్స్ ప్రతి పీఏసీఎస్‌కు అందుబాటు లోకి వస్తాయి. ప్రతీ రైతుకు అతని ఇంటి వద్దనే బ్యాంకింగ్ సేవలు అందించడా నికి ఈ టచ్‌ప్రింక్స్ ఉపయోగపడతాయి. పారదర్శకత, జవాబుదారీతనం, ప్రధాన లక్ష్యాలుగా పీఏసీఎస్ సంఘాల్లోని సభ్యుల వివరాలను సంఘాల్లోని రికార్డులను డిజిటలైజేషన్ చేయడం వల్ల సంఘాల సభ్యులకు మరింతగా సేవలు అందించే పరిస్థితి ఏర్పడుతుంది. ఈ కంప్యూటరీ కరణలో పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపికైన చేబ్రోలు, శనివారపుపేట విశాల సహకార సంఘాలలో 95 శాతం డిజిటలైజేషన్ ప్రక్రియ పూర్తయింది. మిగిలిన సహకార సంఘాల్లో డిజిటలైజేషన్ ప్రక్రియ వేగవంతంగా కొనసాగుతోంది.

5,46,595 సభ్యుల వివరాలు డిజిటలైజేషన్ పూర్తి

సహకార సంఘాల కంప్యూటరీకరణలో భాగంగా జిల్లాలోని 158 పీఏసీఎస్‌లలోని 8,59,673 సభ్యుల ప్రొఫైల్స్‌కు సంబంధించి ఇప్పటి వరకు 5,46,595 సభ్యుల ప్రొఫైల్స్‌ను డిజిటలైజేషన్ చేశారు. ఇంకా 1,62,671 మంది సభ్యత్వ వివరాలు, 1,48,006 సభ్యుల భూముల వివరాలు, 95,174 మంది సభ్యుల డిపాజిట్ల వివ రాలు, 1,04,022 సభ్యుల రుణాల వివరాలు, 10,287 సభ్యుల పెట్టుబడుల వివరాలు, 26,435 ఖాతాల బ్యాంక్ అప్పుల వివరాలు ఇప్పటికే డేటా ఎంట్రీ ప్రక్రియ పూర్తయింది.ఈ డిజిటలైజేషన్ పురోగతి ప్రక్రియలో ఏలూరు జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ ప్రథమ స్థానంలో నిలిచింది. ప్రతి పీఏసీఎస్ ఒక బ్యాంక్ వలె కోర్ బ్యాంకింగ్‌తో పనిచేస్తూ సభ్యులకు అన్ని రకాల ఆన్‌లైన్ సేవలు అందించడానికి వీలవుతుంది.

ఏలూరు రూరల్ ఎస్‌ఐపై చర్యలకు సిఫార్సు

నూజివీడు, సెప్టెంబరు 25:పెండింగ్‌లో ఉన్న పలు క్రిమినల్ కేసుల్లో సాక్ష్యం ఇవ్వకుండా కోర్టుకు గైర్హాజరవుతున్న ఏలూరు రూరల్ ఎస్సై రాజా రెడ్డిపై శాఖాపరమైన క్రమశిక్షణా చర్యలు తీసుకోవాలని నూజివీడు స్పెషల్ మేజిస్ట్రేట్ వేల్పుల కృష్ణమూర్తి, ఏలూరు ఐజీ, ఎస్పీలకు బుధ వారం సిఫార్సు చేశారు. గతంలో ముసునూరు ఎస్సైగా పనిచేసిన రాజా రెడ్డి పలు కేసుల్లో ఛార్జ్‌షీట్ దాఖలు చేశారు. ఆ కేసులు ప్రస్తుతం విచారణ దశలో ఉండగా, ఎస్సై కోర్టుకు రాకుండా ఏదో ఒక కారణంతో గైర్హాజరవుతున్నారు.కోర్టు పలుమార్లు సమన్లు జారీ చేసినప్పటికి ఎస్సై కోర్టుకు రాకుండా వాయిదాలు అడుగుతుండటంతో విచారణ చివరి దశలో ఉన్న కేసులు ఎస్సై నిర్లక్ష్యం కారణంగా వాయిదా పడుతుండటంతో శాఖాపరమైన చర్యలు తీసుకోవాల్సిందిగా న్యాయమూర్తి సిఫార్సు చేశారు.

ఇది చెరువు కాదు.. రోడ్డే..

వర్షాకాలంలో ఈ రోడ్డు ఎప్పుడు చెరువునే తలపిస్తుంది. తంగెళ్లమూడి నేతాజీ నగర్ మినీ టవర్స్‌రోడ్డు ఇది. ఇటీవల కొంతకాలం నుంచి నిరంతరం కురుస్తున్న వర్షాలతో రోడ్డు జలమయంగా మారింది. వర్షపునీరుపోవడానికి ఇక్కడ డ్రైన్లులేవు. మున్సిపల్ పారిశుధ్య సిబ్బంది నీళ్ళను తొలగించే కార్యక్రమం చేపట్టారు. ఎన్నో సార్లు మున్సిపల్ సిబ్బందికి, మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికి మా గోడువినిపించుకోలేదు. రోడ్ల పై విద్యార్థులు, మహిళలు, వృద్ధులు, పాదచారులు, వాహనదారులు, నడవటానికి తీవ్ర ఇబ్బందులుపడుతున్నారు. రోడ్ల పై గుంతలు ఉండటంతో నీళ్ళలో కనపడక గుంతల్లో పడిపోతున్నారు. మున్సిపల్ అధికారులు తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. - **ఏలూరు టూ టౌన్**



క్రైమ్ కార్నర్

సీబీఐ పోలీసులమని బెదిరించి తొమ్మిది లక్షలు లాగేశారు

ఏలూరులో మోసపోయిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి

ఏలూరు క్రైం, సెప్టెంబరు 25 :మీ నెంబర్ చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు వినియోగిస్తున్నారంటూ ఒక సాఫ్ట్‌వేర్ ఉద్యోగి నుంచి రూ.9 లక్షలు లాగేశారు.. బాధితుడు తేరుకుని ఏలూరు త్రీటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు. ఏలూరు శ్రీరామ్‌నగర్‌లో నివాసం ఉంటున్న మహ్మద్ రాహిల్ (29) సాఫ్ట్‌వేర్ ఉద్యోగి.. వర్క్ ఫ్రమ్ హోమ్‌లో ఉన్నారు. బుధవారం అతనికి ఒక వ్యక్తి ఫోన్ చేసి తాము ట్రాయ్ నుంచి మాట్లాడుతున్నామని చట్ట వ్యతిరేక కార్యకాలపాలకు పాల్పడుతున్నారంటూ బెదిరించాడు. కాల్‌ను మరో వ్యక్తికి ట్రాన్స్‌ఫర్ చేయగా తాము ముంబై సీబీఐ పోలీసులమని బెదిరించి రూ.9 లక్షల రూపాయలను బదిలీ చేయించుకున్నారు. తాము ముంబై సీబీఐ పోలీసులమని క్రైం బ్రాంచ్‌కు చెందిన వారమని ఆధార్ కార్డు, అతని వివరాలను చెప్పారు. భయపెట్టి రూ.9 లక్షల రూపాయలను కాన్పూర్ మార్కెట్ ఏరియాలోని సీఎస్‌బీఐ బ్యాంక్ అకౌంట్‌కు బదిలీ చేయించుకున్నారు. తాను మోసపోయానని గ్రహించి ఏలూరు త్రీటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో సీఐ కోటేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అకౌంట్‌కు బదిలీ అయిన సొమ్మును తిరిగి రప్పించేందుకు సైబర్ సెల్ విభాగానికి సమాచారం ఇచ్చారు.

లారీ ఢీకొని చెక్‌పోస్టు ఉద్యోగి మృతి

కాళ్ళ, సెప్టెంబరు 25 : లారీ ఢీకొని చెక్‌పోస్టులో విధులు నిర్వహిస్తున్న వ్యక్తి మృతి చెందిన సంఘటనపై కాళ్ళ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. కాళ్ళ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం భీమవరం మండలం రాయలం గ్రామానికి చెందిన సాలా వెంకటేశ్వరరావు (48) భీమవరం వ్యవసాయ మార్కెటింగ్ శాఖలో అసిస్టెంట్‌గా పనిచేస్తున్నారు. మంగళవారం కాళ్ళ మండలం పెద అమిరం పరిధిలో ఉన్న ఉండి మార్కెట్ యాడ్ చెక్ పోస్టులో విధులు నిర్వహిస్తుండగా రొయ్యలు లారీని ఎర్రజెండాతో ఆపే ప్రయత్నం చేశారు. సదరు వాహనం అతివేగంతో వెంకటేశ్వరరావుని ఢీకొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. భీమవరం ఆసుపత్రి తీసుకువెళ్ళగా మృతి చెందాడు. దీనిపై మృతుడి కుమారుడు శ్రవణ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కాళ్ళ ఎస్ఐ ఎస్.శ్రీనివాసరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఆసుపత్రికి వెళ్లితే ఇంట్లో చొరబడి చోరీ

ఏలూరు క్రైం, సెప్టెంబరు 25 : ఇంటికి తాళం వేసి ఆసుపత్రికి వెళ్ళి తిరిగి వచ్చేసరికి దొంగలు ఆ ఇంటి తాళాలు పగులగొట్టి బంగారు ఆభరణాలు, వెండి వస్తువులు, నగదు అపహరించుకుపోయారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఏలూరు టూటౌన్ పోలీసు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఏలూరు ఆదివారపుపేటలోని రజకుల కాలనీలో నివాసం ఉంటున్న గోవాడ సురేష్ తన తండ్రి భద్రయ్యను బుధవారం ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తీసుకువెళ్ళారు. ఇంటికి తాళాలు వేశారు.ఆసుపత్రి నుంచి వచ్చేసరికి ఇంటి తాళాలు పగులగొట్టి ఉన్నాయి. ఇంట్లోని పది కాసుల బంగారు ఆభరణాలు, కొన్ని వెండి వస్తువులు, లక్ష రూపాయలు నగదు అపహరణకు గురయ్యాయి. సురేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.



రాఘవాపురంలో సిలిండర్ పేలి ఇల్లు దగ్ధం

చింతలపూడి, సెప్టెంబరు 25 : చింతలపూడి మండలం రాఘ వాపురం సెంటర్‌లో చిమ్మపూడి నాగరాజు అనే వ్యక్తి ఇంట్లో బుధవారం తెల్లవారు జామున 2.30 గంటల ప్రాంతంలో సిలిం డర్ పేలి అగ్నిప్రమాదం జరిగింది. ఇల్లు ధ్వంసం కాగా విలువైన ఫర్నీచర్ కాలిపోయింది. ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ప్రాణనష్టం తప్పింది.సిలిండర్ పేలిన శబ్దానికి చుట్టుపక్కల గృహవాసులు లేచి చూసేసరికి డాబా ఇల్లు, ఫర్నీచర్ దగ్ధమవుతుండడంతో అగ్నిమాపక అధికారులకు సమాచారం ఇచ్చారు. అప్పటికే గ్రామస్థులు మంటలను అదుపులోకితెచ్చి సిలిండర్‌ను బయటకు తీసుకువచ్చారు. అదనపు సిలిండర్ పేలిందని చెబుతున్నారు. నాగరాజు దంపతులు 20 రోజుల నుంచి జ్వరాల వలన కూతురు ఇంటికి తెలంగాణ రాష్ట్రం అచ్చు తాపురం వెళ్ళారు. ప్రమాదం సమాచారంతో ఉదయమే ఇల్లు చేరుకున్నారు. ప్రమాదంలో ఇల్లు ధ్వంసం కావడం చూసి అయోమయంలో పడ్డారు. దీంతో ఇంటిలోని విలువైనఫర్నీచర్, నగదు, బంగారం లక్షల్లో నష్టం ఉంటుందని చెబుతున్నారు. చింతలపూడి పోలీసులకు, తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. అగ్నిమాపక అధికారి కోటేశ్వరరావు మాట్లాడుతూ విద్యుత్ షార్ట్ సర్క్యూట్ అయ్యి మంటల వల్ల సిలిండర్ అంటుకుని ప్రమాదం జరిగిందని భావిస్తున్నట్టు తెలిపారు. చింతలపూడి సీఐ రవీంద్రనాయక్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ

మద్యం దుకాణాల్లో 10 శాతం కేటాయింపుతో వృత్తి దారులకు ఉపాధి : పితాని

భీమవరం టౌన్, సెప్టెంబరు 25 : నూతన మద్యం విధానంలో భాగంగా ప్రభుత్వ మద్యం దుకాణాల్లో 10 శాతం కల్లుగీత వృత్తిదారులకు కేటాయించిందని దీని అమలుకు ఎమ్మెల్యేలు పూర్తిగా సహకరించాలని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు, ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ అన్నారు. ఈ మేరకు ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేయనున్నట్టు తెలిపారు. గీత వృత్తి దారుల ఉపాధి కల్పనకు ఇది దోహదపడుతుందని ఇందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడికి బీసీ కులాలన్నీ రుణపడి ఉంటాయని చెప్పారు. భీమవరం మావుళ్ళమ్మ ఉత్సవ కమిటీ సమావేశ మందిరంలో బుధవారం జిల్లా స్థాయి శెట్టిబలిజ, గౌడ, శ్రీశయన, కల్లుగీత వృత్తి దారుల సమాఖ్య సమావేశం నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న పితాని మాట్లాడుతూ భవిష్యత్తులో 50 వాటా సాధన కోసం వృత్తిదారులు సమిష్టిగా కృషి చేయాలన్నారు. 10 శాతం అమలయ్యే విధంగా ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేలు పూర్తి స్థాయిలో సహకరించాలన్నారు. ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా కల్లుగీత వృత్తిదా రులకు డిపాజిట్‌ను 50 శాతానికి తగ్గించాలని విజ్ఞప్తి చేశారు. భారతీయ జనతా పార్టీ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ చైర్మన్ పాకా వెంకట సత్యనారాయణ మాట్లాడుతూ గతంలో రాజమహేంద్రవరంలో జరిగిన వృత్తిదారుల సమావేశంలో మద్యం దుకాణాలు 50 కేటాయించాలని తీర్మానం చేశామన్నారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం 10 శాతం కేటాయించడం శుభపరిణామమన్నారు. శెట్టిబలిజ గౌడ సమాఖ్య జిల్లా అధ్యక్షుడు వేండ్ర వెంకటస్వామి మాట్లాడుతూ నూతన మద్యం విధానంలో అందరికీ న్యాయం జరిగేలా చూడా లన్నారు. ఉండి నియోజకవర్గ జనసేన ఇన్‌ఛార్జి జుత్తిగ నాగరాజు, జిల్లాలోని పలువురు శెట్టిబలిజ, గౌడ, శ్రీశయన, యాత, ఈడిగ కులాలకు చెందిన నాయకులు హాజరయ్యారు.



చాట్రాయి పోలీస్‌స్టేషన్‌లో స్వాధీనం చేసుకున్న బైక్‌లు చూపుతున్న సీఐ, ఎస్సై

బైక్ దొంగ అరెస్టు..13 బైక్‌లు స్వాధీనం

చాట్రాయి, సెప్టెంబరు 25: ఏలూరు, ఎన్టీఆర్ జిల్లాల్లో ద్విచక్రవాహనాల చోరీకి పాల్పడుతున్న కోట రవి (29)ని పోలీసులు అరెస్ట్ చేశారు. చాట్రాయి పోలీస్‌స్టేషన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నూజివీడు రూరల్ సీఐ కె. రామకృష్ణ, ఎస్సై డి. రామకృష్ణ వివరాలు వెల్లడించారు. చాట్రాయి మండలం పోలవరానికి చెందిన కోట రవి కొంత కాలంగా చోరీలకు పాల్పడుతున్నాడని, ఏలూరు పట్టణంలో 8 బైక్‌లు, చాట్రాయి పోలీస్ స్టేషన్ పరిధిలో 3 బైక్‌లు, ఒక మేకపోతు, ఎన్టీఆర్ జిల్లా తిరువూరులో ఒక బైక్ చోరీ చేశాడన్నారు. మంగళవారం రాత్రి నిందితుడు రవిని అరెస్ట్ అతడు ఇచ్చిన సమాచారం మేరకు రూ. 5 లక్షలు విలువ చేసే 12 బైక్‌లు, నేరానికి ఉపయోగించిన మరో బైక్‌ను, ఒక మేకపోతును స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. మోటార్ సైకిళ్ళ రికవరీలో ప్రతిభ చూపిన ఎస్సై డి. రామ కృష్ణ, హెచ్‌సి విజయ భాస్కర్, పీసీలు విష్ణుకుమార్, గిరిబాబును జిల్లా ఎస్పీ అభినందిస్తూ పంపిన క్యాష్ రివార్డులను సీఐ అందజేశారు. కాగా నిందితుడిని తిరువూరు కోర్టులో హాజరుపరచగా రిమాండ్ విధించారు.

పంట కాల్వలో మృతదేహం గుర్తింపు

కైకలూరు, సెప్టెంబరు 25: పంటకాలువలో గుర్తు తెలియని మృతదేహం వివరాలు తెలిసినట్టు కైకలూరు టౌన్ సీఐ పి.కృష్ణ తెలిపారు. ఈ నెల 21న కైకలూరు మండలం వింజరంలోని పోల్‌రాజ్ పంటకాలువ లాకుల వద్ద గుర్తుతెలియని మృతదేహం ఉన్నట్లు వీఆర్వో ఫిర్యాదు మేరకు మృతదేహాన్ని కైకలూరు ప్రభుత్వాసుపత్రి మార్చురీకి తరలించారు. పంటకాలువలో గుర్తు తెలియని మృతదేహం శీర్షికన ఈ నెల 22న 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన వార్త ఆధారంగా మృతుడి కుమార్తె జ్యోతిర్మయి కైకలూరు టౌన్ పోలీసులను బుధవారం సంప్రదించింది. దీంతో పోలీసులు మార్చురీలోని మృత దేహాన్ని చూపించగా మృతుడి చేతివేళ్ళను చూసి ఆమె తండ్రిగా గుర్తించింది. మృతుడు తూర్పుగోదావరి జిల్లా అనపర్తి మండలం కుతుకులూరు గ్రామానికి చెందిన చేనేత కార్మికుడు నక్కిన నాగభూషణం (47)గా గుర్తించారు. నాగభూషణం ఈ నెల 1న తెలంగాణాలో వివిధ గ్రామాల్లో తన బంధువుల ఇంటి వద్ద చేనేత పనికి వెళ్లాడు. మహబూబాబాద్ సమీపంలో రాళ్ళవాగు దాటుతుండగా నీటి ఉధృతికి కొట్టుకుపోయాడు. కృష్ణా నది ద్వారా కాలువల వెంబడి వింజరం వరకు మృతదేహం కొట్టుకువచ్చింది.

ఎక్సైజ్‌శాఖలో బదిలీలు

ఏలూరు డిప్యూటీ కమిషనర్‌గా బి.శ్రీలత

ఏలూరు క్రైం, సెప్టెంబరు 25 : స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (ఎస్‌ఈబీ)ను రాష్ట్ర ప్రభుత్వం రద్దు చేసి ఆ సిబ్బందిని తిరిగి మాతృ సంస్థ అయిన ఎక్సైజ్ శాఖకు బదిలీ చేస్తూ పోస్టింగులు కల్పించారు. దీంతో ఎక్సైజ్‌శాఖకు పూర్వవైభవం వచ్చినట్లు అయింది. దీంతో ప్రతి జిల్లాకు డిప్యూటీ కమిషనర్, ఎక్సైజ్ సూపరింటెండెంట్, అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ వంటి పోస్టులు తిరిగి ఆ శాఖలో వచ్చాయి. 14 మంది డిప్యూటీ కమిషనర్లను బదిలీలు చేశారు. ఏలూరు జిల్లా ఎక్సైజ్‌శాఖ డిప్యూటీ కమిషనర్‌గా కర్నూలు జిల్లా ఎక్సైజ్ డిప్యూటీ కమీషనర్‌గా విధులు నిర్వర్తిస్తున్న శ్రీలతను నియమించారు. ఎక్సైజ్ శాఖలో పని చేస్తున్న అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ విభాగంలో 19 మందిని బదిలీలు చేశారు. ఏలూరు విజిలెన్సు అసిస్టెంట్ కమీషనర్‌గా పనిచేస్తున్న చంద్రశేఖర్‌రెడ్డిని కడప జిల్లాకు బదిలీ చేశారు. భీమవరం ఎస్‌ఈబీ అసిస్టెంట్ కమిషనర్‌గా పనిచేసి పోస్టింగ్ కోసం ఎదురు చూస్తున్న నాగ ప్రభుకుమార్‌ను ఏలూరు జిల్లాకు బదిలీ చేశారు. ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్, డిస్ట్రిక్ట్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఆఫీసర్స్ మొత్తం 45 మందిని బదిలీలు చేశారు. ఏలూరు ఎస్‌ఈబీ ఇఎస్‌గా పనిచేస్తూ ఎస్‌ఈబీ రద్దు కావడంతో పోస్టింగ్ కోసం ఎదురు చూస్తున్న కె.రామకృష్ణను అల్లూరి జిల్లాకు బదిలీ చేశారు. ఏలూరు జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న డాక్టర్ ఆర్ఎస్ కుమారేశ్వరన్‌ను పశ్చిమ గోదావరి జిల్లా భీమవరానికి బదిలీ చేశారు. కృష్ణా జిల్లా డిస్ట్రిక్ట్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న బౌలయ్యను ఏలూరు జిల్లాకు బదిలీ చేశారు. ఏలూరులో ఉన్న ఏపీ ఎస్‌బీసీఎల్ డిపో మేనేజర్‌గా పనిచేస్తున్న దేవదత్తును బాపట్ల జిల్లాకు బదిలీ చేశారు. భీమవరం డిస్ట్రిక్ట్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఆఫీ సర్‌గా పనిచేస్తున్న గౌరీశ్వరరావును ఏపీఎస్‌బీసీఎల్ డీఎంగా బదిలీ చేశారు.



ఎమ్మెల్యే అంజిబాబుకు రూ.లక్ష విరాళం చెక్కు అందిస్తున్న దాతలు



ఎమ్మెల్యే పితానికి రూ.42 వేలు డీడీని అందిస్తున్న వడలి గ్రామ నాయకులు



ఆకివీడులో వరద బాధితుల పిల్లలకు పుస్తకాలు అందజేస్తున్న లయన్స్ ప్రముఖులు

కష్టకాలంలో అండగా..

» విజయవాడ వరద బాధితులకు విరాళాల వెల్లువ

భీమవరంటౌన్, సెప్టెంబరు 25:కష్ట సమయంలో బాధితులను ఆదుకోవడానికి దాతలు స్పందించడం గొప్ప విశేషమని ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు అన్నారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో భీమవరానికి చెందిన మాచర్ల శివభాస్కర్‌రావు, సునీత కుమార్తె డాక్టర్ సారి షిర్డీ (ఎయిమ్స్ ఎండీ) రూ.1 లక్ష సహాయాన్ని వరద బాధితుల సహాయార్థం ఎమ్మెల్యే అంజిబాబుకు అందించారు. జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు కోటికలపూడి గోవిందరావు, పట్టణ అధ్యక్షుడు చెనమల చంద్రశేఖర్, బండి రమేష్ కుమార్, జనపాటి మధుసూదనరావు తదితరులు పాల్గొన్నారు.

• పెనుగొండ, సెప్టెంబరు 25 : వడలి గ్రామ నాయకులు విజయవాడ వరద బాధితుల సహాయార్థం రూ.42 వేలు డీడీని ఎమ్మెల్యే పితాని సత్యనారాయణకు అందజేశారు. కూటమి నాయకులు పాల్గొన్నారు.

• ఆకివీడు, సెప్టెంబరు 25 : మానవసేవే మాధవసేవని లయన్స్ జిల్లా గవర్నర్ కాకరాల వేణుబాబు అన్నారు. గొట్టుముక్కల వెంకట సుబ్బరాజు ఫౌండేషన్, లయన్స్ ఆధ్వర్యంలో సమతానగర్ వరద బాధితులకు రూ.1లక్ష ఆర్థిక సాయంతో చీరలు, లుంగీలు, కండువాలు, దుప్పట్లు, వస్త్రాలు, పిల్లలకు విద్యా సామాగ్రి బుధవారం స్థానిక సమతానగర్‌లోని ఎంపీపీ పాఠశాల ప్రాంగణంలో అందజేశారు. ఫౌండేషన్ వ్యవస్థాపకుడు గొట్టుముక్కల వెంకట సత్యనారాయణరాజు, లయన్స్ క్లబ్ కార్యదర్శి గొట్టుముక్కల నారాయణరాజు, పడవల సూర్యనారాయణరాజు, చిలుకూరి కృష్ణంరాజు, గుర్రం శ్రీనివాసరావు, వేగేశ్న వెంకట కృష్ణంరాజు, గొంట్లా కృష్ణమూర్తి, గొంట్లా సత్యనారాయణ, దాట్ల రామరాజు, సన్నిధి వెంకన్నబాబు, కాకర్ల రాజరాజేశ్వరి ఉన్నారు.

కూటమి నాయకులకు పాలాభిషేకం..

ఆకివీడు, సెప్టెంబరు 25 : కూటమి ప్రభుత్వం వరద బాధితులను ఆపద సమయంలో ఆదుకోవడమే కాకుండా నష్టపరిహారం కింద బ్యాంకుఖాతాలో ఒక్కొక్కరికి రూ .10వేలు చొప్పున జమ చేయడం ధన్యవాదాలని బాధితులు తెలిపారు. పట్టణ పరిధిలో 296 మంది ముంపు బాధితులకు బుధవారం రూ.10వేలు చొప్పున బ్యాంకు ఖాతాలో జమ చేయడంతో స్థానిక సమతానగర్‌లో సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్, ఎమ్మెల్యే రఘురామ చిత్రపటాలకు బాధితులు పాలాభిషేకం చేశారు. మాజీ సర్పంచ్ గొంట్లా గణపతి, టీడీపీ పట్టణ ప్రధాన కార్యదర్శి గంధం ఉమా, జనసేన పట్టణ అధ్యక్షుడు పిల్లా బాబులు మాట్లాడుతూ పేద ప్రజలకు అండగా ఉండేది కూటమి ప్రభుత్వమేనని మరోసారి రుజువు చేసిందన్నారు. కార్యక్రమంలో సమతానగర్ ఇన్‌ఛార్జీ కారంపూడి సుమంత్, గవర లక్ష్మి, కోమటి గోపి, గూడాల మ రియమ్మ, రామరాజు తదితరులు ఉన్నారు.

బాధితులకు అండగా నిలిచిన ఆరిమిల్లి

ఇరగవరం, సెప్టెంబరు 25: తూర్పువిప్పర్రు శివారు నారాయణపురంలో ఇటీవల అగ్నిప్రమాదంలో ఇల్లు కోల్పోయిన బాధితులు నామాల సత్యనారాయణ, నామాల చిన సత్యనారాయణను ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ బుధవారం పరామర్శించారు. తక్షణ సాయంగా రూ. 10 వేలు, 25 కేజీల బియ్యం అందించి అండగా నిలుస్తామని హామీ ఇచ్చారు.



బాధితులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే ఆరిమిల్లి

సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా కూటమి పాలన

భీమవరంటౌన్, సెప్టెంబరు 25 : సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సారథ్యంలో కూటమి ప్రభుత్వం వంద రోజుల పాలనలో అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టిందని ఎమ్మెల్యే పులపర్తి అంజిబాబు అన్నారు. వీరవాసరం మండలం మత్స్యపురి గ్రామంలో కూటమి ప్రభుత్వం వంద రోజుల పరిపాలన పూర్తి చేసుకున్న సందర్భంగా బుధవారం ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రం సంక్షోభంలో ఉన్నా సంక్షేమ పథకాలు అమలు చేసిన ఘనత కూటమి ప్రభుత్వంకే దక్కిందని అన్నారు. ఎంపీడీవో టీవీ సారథి, శాంతిప్రియ, ఎంపీపీ వీరవల్లి దుర్గాభవాని, ఎంపీటీసీ కోడి ఆదిలక్ష్మి, వీరవల్లి చంద్రశేఖర్, మెంటే పార్థసారథి, కోళ్ల నాగేశ్వరరావు, చెనమల్ల చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

• తణుకు, సెప్టెంబరు 25: విజనరీ నాయకుడు చంద్రబాబు అని ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. వేల్పూరులో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ వేల్పూరులో అన్నక్యాంటీన్ ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు. డిప్యూటీ సీఎం పవన్ పంచాయతీ నిధులను పునరుద్ధరిస్తున్నారని చెప్పారు. రెల్లి, సగర వర్గీయుల సంఘ భవనానికి పంచాయతీ నుంచి ఎమ్మెల్యే చేతుల మీదుగా స్థలం అందజేశారు. కూటమి నాయకులు పాల్గొన్నారు.

• పాలకోడేరు/ఆకివీడు రూరల్:రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే సీఎం చంద్రబా బుతోనే సాధ్యమని నమ్మి ప్రజలు అధికారాన్ని కట్టబెట్టారని మోగల్లు గ్రామ టీడీపీ నాయకులు మోగల్లు బాబు, సంకురుడు, మల్లిపూడి శ్రీనివాస్ అన్నారు. బుధవారం పాలకోడేరు మండలం మోగల్లు, ఆకివీడు రూరల్ గ్రామం అయి భీమవరం గ్రామాల్లో 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి వెళ్లి స్టిక్కర్లు అంటించారు. సాంబ్రాణి శ్రీను, కొడమంచిలి ప్రభాకరరావు, భాస్కరరావు, రాంబాబు పాల్గొన్నారు. అయిభీమవరంలో మాజీ వైస్ ఎంపీపీ నౌకట్ల రామారావు, మాజీ సర్పంచ్ కనుమూరు రామకృష్ణంరాజు, మీసాలరవి, జంపన రాజ్యంరాజు, నౌకట్ల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

• నరసాపురం టౌన్ : కూటమి వంద రోజుల పాలనలో అన్ని వర్గాలు చాలా సంతోషంగా ఉన్నారని టీడీపీ రాష్ట్ర అగ్ని కుల క్షత్రియ సాధికార కన్వీనర్ కొప్పాడ రవి అన్నారు. బుధవారం పట్టణంలోని పీచుపాలెంలో మంచి పాలన కరపత్రాలను ఇంటింటికి వెళ్లి అందించారు. కౌన్సిలర్ బొమ్మిడి సూర్యకుమారి, పెండ్ర శ్రీనివాస్, కృష్ణమూర్తి, అర్జునరావు, తదితరులు పాల్గొన్నారు.

• పెనుమంట్ర/ఆచంట/పోడూరు, :వైసీపీ మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు రాజ్యసభ సభ్యులు పార్టీలు మారుతున్నారని త్వరలోనే వైసీపీ కనుమరుగువుతుందని ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ జోస్యం చెప్పారు. పెనుమంట్ర మండలం పాలమూరులో ఇది మంచి ప్రభుత్వం వంద రోజుల పాలన పురస్కరించుకుని ప్రజావేదిక నిర్వహించారు. ప్రజల నుంచి సమస్యలను అడిగి తెలుసుకున్నారు విజ్ఞాపన పత్రాలను అందుకున్నారు. గ్రామంలో సామూహిక సీమంతాలు నిర్వహించి, మహిళలకు పూలు పండ్లు గాజులు నూతన వస్త్రాలను అందజేసి ఆశీర్వచనాలు అందించారు. గ్రామ సర్పంచి కాకర రాజేశ్వరరావు మాజీ సర్పంచ్ చింతపల్లి రామకృష్ణ, ఎంపీటీసీ మచిరెడ్డ దుర్గ, మాజీ ఏఎంసీ చైర్మన్ సానబోయిన గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు. ఆచంట మండలం భీమలాపురంలో సర్పంచ్ గుబ్బల మాధవ రావు అధ్యక్షతన ప్రజా వేదిక కార్యక్రమం నిర్వహించారు. జడ్పీటీసీ ఉప్పల పాటి సురేష్‌బాబు, ఎంపీపీ దిగుమర్తి సూర్యకుమారి మాట్లాడారు. వైస్‌చైర్మన్ యర్రగొప్పుల నాగరాజు, చల్లా సుబ్బారాయుడు, చింతపర్తి శ్రీను తదితరులు పాల్గొన్నారు. పోడూరు మండలం పెనుమదం సచివాలయం వద్ద ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం సభలో టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు, మాజీ ఎంపీపీ పెన్మెత్స రామభద్రరాజు మాట్లాడారు. కార్యక్రమానికి సర్పంచ్ తానేటి బాబూరావు అధ్యక్షత వహించారు. ఎంపీటీసీ మానేపల్లి శ్రీధర్, టీడీపీ గ్రామ అధ్యక్షుడు కడలి ఆంజనేయులు, దేవరపు దొరబాబు, తంగెళ్ల సత్యనారాయణ, కార్యదర్శి నూటికుర్తి శ్యాంబాబు తదితరులు పాల్గొన్నారు.

'ఇది మంచి ప్రభుత్వం'లో ఎమ్మెల్యే పులపర్తి అంజిబాబు



పెనుమదం సభలో మాట్లాడుతున్న పెన్మెత్స రామభద్రరాజు

• మొగల్తూరు : రాష్ట్రంలో సీఎం చంద్రబాబు సారథ్యంలో వంద రోజుల కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేస్తూ రాష్ట్రాభివృద్ధి సంక్షేమానికి కృషి చేస్తుందని టీడీపీ, జనసేన నాయకులు పేర్కొన్నారు. పెద్దపల్లవపాలెంలో ఇంటింటా కరపత్రాలను పంపిణీ చేశారు. టీడీపీ నాయకులు బస్వాని ఏడుకొండలు, జనసేన నాయకులు వాటాల కృష్ణమూర్తి, కొప్పాడి నాగరాజు, వాటాల దుర్గరాజు, వాటల కృష్ణమూర్తి, వాతాడి తాతయ్య, మోకా శ్రీరామ్మూర్తి, బందన వెంకటేశ్వర్లు, వాటాల వీరాస్వామి తదితరులు పాల్గొన్నారు.

• పాలకొల్లురూరల్ : రాష్ట్ర ప్రజల మేలు కోరేది కూటమి ప్రభుత్వం అని అన్ని వర్గాల ప్రజలు సంతృప్తితో ఉన్నారని కూటమి నాయకులు అన్నారు. శివదేవుని చిక్కాలలో బుధవారం ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంపీడీవో సంగాని వెంకటేశ్వరరావు, తహసీల్దార్ వై.దుర్గా కిషోర్, ఏపీఎం జ్యోతి, నాయకులు కపర్ధి, కోడి విజయభాస్కర్, కోటి రాంబాబు, ఇంటి శ్రీరాముడు, అంగర వీరభద్రకుమార్, పి.శ్రీనివాసరావు, వడ్డే సోమ చంద్రశేఖర్, శివగణేష్, కొట్టు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా కేంద్ర ఆస్పత్రిలో కార్మికుల సమస్యలపై ఆరా

తణుకు, సెప్టెంబరు 25: తణుకు జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేస్తున్న కాంట్రాక్టు పారిశుధ్య, సెక్యూరిటీ సిబ్బంది తమ వేతన, పీఎఫ్, ఈఎస్ఐ బకాయిలపై మంగళవారం తణుకు విచ్చేసిన కలెక్టర్ నాగరాణికి ఫిర్యాదు చేశారు. దీంతో కాంట్రాక్టరుకు నోటీసులు ఇవ్వాలని ఆదేశించారు. దీనిలో భాగంగా బుధవారం కార్మిక శాఖ సహాయ కమిషనర్ ఎ.నాగలక్ష్మి ఆసుపత్రికి వచ్చి బకాయి వేతనాలపై అడిగి తెలుసుకున్నారు. త్వరలోనే కార్మికుల ఖాతాలో జమ అయ్యేలా చూస్తామని చెప్పారు. అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ బి.లక్ష్మణరావు, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వి.అరుణ పాల్గొన్నారు.

నేడు ట్రస్టు ఆసుపత్రికి ప్రత్యేక వైద్యుల రాక

పెంటపాడు, సెప్టెంబరు 25 : అలంపురం ట్రస్టు ఆసుపత్రికి ఈనెల 26న రాజానగరం జీఎస్ఎల్ ఆసుపత్రి నుంచి ప్రత్యేక వైద్య నిపుణులు వస్తున్నట్టు ట్రస్టు చైర్మన్ కొలనువాడ పెదకృష్ణంరాజు తెలిపారు. క్యాన్సర్, స్త్రీ సంబంధ, గుండె సంబంధ, చిన్నపిల్లలు, జనరల్ మెడిసిన్ వైద్య నిపుణులు ఉచితంగా వైద్య సేవలు అందిస్తారన్నారు. అవసరమైన వారికి ఈసీజీ, టూడీ ఎకో, అల్ట్రాసౌండ్ స్కానింగ్‌లతో పాటు అన్ని రకాల రక్త పరీక్షలు ఉచితంగా చేస్తారని ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మహిళలతో గౌరవంగా మెలగాలి

తణుకు, సెప్టెంబరు 25: ప్రతి ఒక్కరు మహిళల పట్ల గౌరవం కలిగి ఉండాలని నాల్గవ అదనపు జిల్లా జడ్జి సత్యవతి అన్నారు. బుధవారం కోర్టు ప్రాంగణంలో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ లింగ వివక్ష చూపవద్దని, మహిళలపై వేధింపులను ఆపాలన్నారు. సీనియర్ సివిల్ జడ్జి కె.సత్యకృష్ణలత, జూనియర్ సివిల్ న్యాయాధికారులు పి.సాయిరాం, కేవీఎస్ రంజిత్‌కుమార్, స్పెషల్ కోర్టు మెజిస్ట్రేట్ చిరంజీవిరావు, న్యాయవాదులు కౌరు వెంకటేశ్వర్లు, దుర్గాభవాని, శ్రావణి, పారా లీగల్ వలంటీర్లు పాల్గొన్నారు.

శ్రీవారి నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం

తణుకు, సెప్టెంబరు 25: ద్వారకాతిరుమల నిత్యాన్నదాన ట్రస్టుకు పైడిపర్రుకు చెందిన కొత్తపల్లి మురళీమోహనరావు కుటుంబసభ్యులు రూ. లక్ష 116 రూపాయలు విరాళంగా అందించినట్లు బుధవారం తెలిపారు. స్వామి వారి దర్శనం అనంతరం విరాళం చెక్కును కొత్తపల్లి సూర్య విగ్నేష్ పేరుతో ఈవో దుర్గారావుకు అందించినట్లు మోహనరావు తెలిపారు.

టీడీపీ నాయకుల ఆర్థిక సాయం

భీమవరం అర్బన్, సెప్టెంబరు 25 : అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న పదో వార్డుకు చెందిన టీడీపీ కార్యకర్త యర్రంశెట్టి దుర్గభవానికి పార్టీ నాయకులు రూ.25 వేలు ఆర్థికసాయాన్ని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యురాలు తోట సీతారామలక్ష్మి బుధవారం అందించారు. ఆమె మాట్లాడుతూ దుర్గభవాని చికిత్స నిమిత్తం పట్టణ ఉపాధ్యక్షులు బొత్స వెంకటరమణ, టీడీపీ కృష్ణబలిజ సాధికార సమితి రాష్ట్ర సభ్యులు గంటా త్రిమూర్తులు, సౌజన్యంతో రూ.25 వేలను అందించామన్నారు. పట్టణ అధ్యక్షులు ఇందుకూరి సుబ్రహ్మణ్యంరాజు, రాష్ట్ర నాయకులు వేండ్ర శ్రీనివాస్, నాయకులు ఐజాక్‌బాబు, గూడురి సుబ్బారావు, చెల్లబోయిన గోవింద్, మల్లువలస రాము, సోమేశ్వరరావు, తదితర నాయకులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం..

- **భీమవరం అర్బన్, సెప్టెంబరు 25 :** మహాత్మాగాంధీ జయంతి పురస్కరించుకుని భీమవరం క్విట్ ఇండియా అమరవీరుల స్థూపం వద్ద అక్టోబరు ఒకటిన అహింస-శాంతి ప్రదర్శనలు నిర్వహిస్తామని వసుధ ఫౌండేషన్ కార్యదర్శి ఇందుకూరి ప్రసాదరాజు తెలిపారు.
- **మొగల్తూరు :** తన భూమిపై రుణం ఇప్పిస్తామని చెప్పి రుణం ఇవ్వకుండానే తన పుట్టింటి యాభై సెంట్ల భూమిని రిజిస్ట్రేషన్ చేయించుకుని మోసగించారంటూ పేరుపాలెంకు చెందిన తిరుమాని గంగ అనే మహిళ ఆవేదన వ్యక్తం చేసింది. న్యాయం చేయాలని కోరారు.
- **నరసాపురం రూరల్ :** సాగునీటి యాజమాన్య పద్ధతులపై రైతులు మరింత అవగాహన పెంచుకోవాలని నవరసపురం గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఏవో డాక్టర్ జాన్సన్ అన్నారు.
- **ఆకివీడు రూరల్ :** గర్భిణులు ఆరోగ్యవంతమైన సమాజం కోసం కృషి చేయాలని చెరుకుమిల్లి గ్రామంలో సామూహిక సీమంతం కార్యక్రమంలో సర్పంచ్ నందమూరి ప్రకాష్ అన్నారు.
- **తణుకు :** డివిజన్ స్థాయి స్కూల్ గేమ్స్ పోటీల్లో తణుకు బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు విజేతలుగా నిలిచి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం పద్మావతి తెలిపారు.
- **భీమవరం అర్బన్ :** ఆర్ఎస్ వంటి నాయకులను కోల్పోవడం సీపీఎంకు ప్రజా ఉద్యమాలకు తీరని లోటని ఆర్ఎస్ సంస్మరణ సభలో ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ, సీపీఎం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.శ్రీనివాసరావు అన్నారు.
- **తణుకు :** భారతీయ జన సంఘ్ ద్వారా రాజకీయ రంగ ప్రవేశం చేసిన పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ రాజకీయ, ఆర్థిక, దేశ సామాజిక పరిస్థితులను మార్చేశారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు నార్ని తాతాజీ అన్నారు. దీన్‌దయాళ్ జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.
- **పాలకొల్లు అర్బన్ :** ఉండి ఎమ్మెల్యే రఘురామ ఏలూరుపాడులో ఈనెల 20వ తేదీన అంబేద్కర్ ఫ్లెక్సీని చింపినందుకు నిరసనగా బుధవారం స్థానిక గాంధీ బొమ్మల సెంటర్‌లో ఎస్సీ అసోసియేషన్ న్యాయవాదులు నిరసన చేపట్టారు.
- **పాలకొల్లు టౌన్ :** వరల్డ్ ఫార్మాసిస్ట్ డే సందర్భంగా యలమంచిలి మండలం కలగంపూడి జిట్స్ ఫార్మసీ కళాశాల విద్యార్థులు పాలకొల్లు యడ్లబజారు నుంచి కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ డాక్టర్ సీహెచ్‌వీ నారాయణరావు ఆధ్వర్యంలో పట్టణంలో ర్యాలీ నిర్వహించారు.
- **ఆచంట :** వల్లూరుకు చెందిన యాతం సత్యనారాయణకు చెందిన మోటారు సైకిల్ తన ఇంటి వద్ద గుర్తుతెలియని వ్యక్తులు అపహరించారని ఆచంట పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ కట్టా వెంకటరమణ తెలిపారు.

తిరుమల పవిత్రతను కాపాడుకుందాం

భీమవరం టౌన్, సెప్టెంబరు 25 : సనాతన ధర్మానికి హాని జరిగితే మౌనంగా ఉండడం మంచిది కాదని, సనాతన ధర్మాన్ని రక్షించుకుని తిరుమల పవిత్రతను కాపాడు కోవాలని ఎమ్మెల్యే పులపర్తి అంజిబాబు అన్నారు. భీమవరం జువ్వలపాలెం రోడ్డులోని పద్మావతి వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో జనసేన ఆధ్వర్యంలో ప్రాయశ్చిత్త దీక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. తొలుత అర్చకులు పూజలను నిర్వహించి శ్రీవారి ఉత్సవ విగ్రహాలకు క్షీరాభిషేకం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రాయశ్చిత దీక్షలో భాగంగా ఈనెల30న సాయంత్రం అన్ని దేవాలయాల్లో దీపాలు వెలిగించడం, వచ్చే నెల ఒకటిన ప్రతి ఒక్కరూ 'ఓం నమో నారాయణాయ' అనే మంత్రాన్ని సామూహికంగా ఆలయాల వద్ద నిర్వహించడం, 2న నగర సంకీర్తన, 3న ఆలయాల్లో భజన కార్యక్రమాలు జరుగుతాయని అన్నారు. ఈవో రుద్రరాజు గంగా శ్రీదేవి, చైర్మన్ మంతెన రామకుమార్‌రాజు, టీడీపీ రాష్ట్ర నాయకులు కోళ్ల నాగేశ్వరరావు, జనసేన పట్టణ అధ్యక్షుడు చెనమల్ల చంద్రశేఖర్, కార్యదర్శి సుంకర రవి, ఉపాధ్యక్షుడు పత్తి హరివర్ధన్, వబిలిశెట్టి రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

• కాళ్ల : తిరుమల వెంకన్న లడ్డూ ప్రసాదాన్ని అపవిత్రం చేసిన దోషులను వెంటనే శిక్షించాలని జనసేన, బీజేపీ ఉండి నియోజకవర్గ ఇన్‌చార్జిలు జుత్తుగ నాగరాజు, కోరా రామ్మూర్తి డిమాండ్ చేశారు. గత వైసీపీ పాలనలో లడ్డూ అపవిత్రం చేయడాన్ని నిరసిస్తూ ఎన్డీయే కూటమి నాయకులు, ఆర్ఎస్ఎస్ నాయకులు, ఆర్యవైశ్య సంఘాల ప్రతినిధులు బుధవారం కాళ్ళ నుంచి కాళ్ళకూరు వేంకటేశ్వరస్వామి ఆలయం వరకు పాదయాత్ర నిర్వహించారు. శ్రీవారికి పూజలు, అభిషేకాలు నిర్వహించి, ఆలయ మెట్లను పసుపు నీళ్ళతో కడిగి శుద్ధి చేశారు. బీజేపీ, జనసేన మండలాధ్యక్షులు సుంకర కాశీవిశ్వేశ్వరరావు, ఎరుబండి రామాంజనేయులు, మాజీ ఎంపీపీ ఆరేటి వెంకటరత్నప్రసాద్, మాజీ సర్పంచ్‌లు కట్రెడ్డి శ్రీనివాసరావు, అడ్డాల శివరామరాజు తదితరులు పాల్గొన్నారు.

• పోడూరు/ఆచంట :లడ్డూ ప్రసాదం కల్తీపై పోడూరు మండలం పెనుమదంలో హిందువులు, వ్యాపార దుకాణదారులు నిరసన తెలిపారు. తొలుత చల్లాలమ్మ గుడి వద్ద మెట్లను నీళ్ల బిందెలతో శుభ్రం చేసి గ్రామంలో ప్రదర్శన నిర్వహించారు. గ్రామంలో వ్యాపార వేత్తలు దుకాణాలను స్వచ్ఛందంగా మూసివేసి ప్రదర్శనలో పాల్గొని నిరసన తెలిపారు. ఆచంట మండలం వల్లూరులో తిరుపతి లడ్డూ తయారీలో జరిగిన అపచారం సరిదిద్దడం కోసం శాంతియుత దీక్షా పోరాటం చేస్తున్న జనసేన అధినేత పవన్ కల్యాణ్‌కు మద్దతుగా కూటమి శ్రేణులు పవన్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. చిట్టూరి శ్రీనివాస్, వెంగలధాసు దానయ్య తాళం శ్రీనివాస్, ఏడిద శ్రీనివాస్, కడిమి ఉమా మహేశ్వరరావు, ఏడిద తేజ, కాపవరపు రామకృష్ణ, పంపన శ్రీను పాల్గొన్నారు.



కాళ్ళ నుంచి కాళ్ళకూరు పాదయాత్ర చేస్తున్న కూటమి నాయకులు

• పాలకొల్లు అర్బన్ : తిరుపతి శ్రీవారి లడ్డూ ప్రసాదం కళంకితమైన సందర్భంగా ప్రాయశ్చిత్తంగా ధర్మపరిరక్షణ సమితి ఆధ్వర్యంలో స్థానిక కెనాల్ రోడ్డులోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో భక్తులు సమకూర్చిన 25 లీటర్ల ఆవుపాలతో స్వామికి అభిషేకం నిర్వహించారు. దాసోహ ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు ఎం. శ్రీనివాసాచార్యులు, సమితి అధ్యక్షుడు గాదె వెంకన్న, కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

• మొగల్తూరు : తిరుమల తిరుపతి పవిత్రను కాపాడాలని కోరుతూ మొగల్తూరులోని వెంకటేశ్వరా భక్త సమాజం ఆధ్వర్యంలో బుధవారం ర్యాలీ నిర్వహించారు. స్థానిక వేంకటేశ్వరస్వామి ఆలయం నుంచి పాతకాలువ సెంటర్, రామాలయం సెంటర్, గాంధీబొమ్మల సెంటర్, థియేటర్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. మాజీ ఉప సర్పంచ్ కలిదిండి కుమార్ బాబు, చల్లా దామోదరం, నాగళ్ళ నాగు, మానేపల్లి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

సీఎం, డిప్యూటీ సీఎంకు జోగయ్య లేఖ

పాలకొల్లు : తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదాన్ని కల్తీ చేయడం పట్ల తీవ్ర మనస్తాపానికి గురయ్యానని రాష్ట్ర కాపు బలిజ సంక్షేమ సంఘం అధ్యక్షుడు చేగొండి హరిరామజోగయ్య బుధవారం సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌లకు లేఖ రాశారు. ఈ లేఖను పాత్రికేయులకు ఆయన విడుదల చేశారు. దీనికి కారకులైన వైఎస్సార్ ప్రభుత్వ అధినేతలను, ఆనాటి దేవాలయ ఉద్యోగులను, టీటీడీ బోర్డు అధ్యక్షులను, బోర్డు సభ్యులను బాధ్యులను చేయాల్సిందేనని, విచారణ జరిపి శిక్షలు విధించాలని లేఖలో పేర్కొన్నారు

అంబేడ్కర్‌పై ఎమ్మెల్యే రఘురామకు ఎంతో గౌరవం

పాలకోడేరు, సెప్టెంబరు 25: అంబేడ్కర్ ఫ్లెక్సీ విషయంలో ఉండి ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజు ఎటువంటి తప్పు చేయలేదని మోగల్లు గ్రామ టీడీపీ నాయకులు అన్నారు. బుధవారం గ్రామంలో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. టీడీపీ గ్రామ నాయకుడు కొత్తపల్లి సూర్యనారాయణరాజు, సంకురుడు, మల్లిపూడి శ్రీనివాస్ మాట్లాడుతూ ఎమ్మెల్యే రఘురామకు డాక్టర్ అంబేడ్కర్ అంటే ఎంతో గౌరవమని, కొంతమంది కావాలనే ఆయనపై బురదచల్లుతున్నారని ఆరోపించారు. మోగల్లు మాజీ సర్పంచ్ కొడమంచిలి ప్రభాకరరావు, మాజీ ఎంపీటీసీ ఉండ్రాజవరపు విజయభాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

• ఎమ్మెల్యే రఘురామపై ఫ్లెక్సీ తీసే విషయంలో దళితులు ఆయనపై అబాండాలు వేయడం సరికాదని విలేకరుల సమావేశంలో పాలకోడేరు గ్రామ టీడీపీ నాయకులు కునాధరాజు మురళీకృష్ణంరాజు, కొత్తపల్లి ఏడుకొండలరాజు అన్నారు. గుత్తుల సత్యనారాయణ, మాధవ, నాగబాబు, కడిమి సత్యనారాయణ, రెడ్డి శ్రీను, రాము, జయలక్ష్మి, తదితరులు ఉన్నారు.

చెకుముకి సైన్స్ సంబరాల విజేతలకు బహుమతులు

భీమవరం ఎడ్యుకేషన్, సెప్టెంబరు 25 : పాఠశాల స్థాయి చెకుముకి సైన్స్ సంబరాలు విద్యార్థులలో సైన్స్ పట్ల అభిరుచిని, ఆసక్తిని కలుగజేస్తుందని చెకుముకి జిల్లా కన్వీనర్ రేపాక వెంకన్నబాబు అన్నారు. 2024 విజేతలకు బహుమతులు అనాకోడేరు, డీఎన్నార్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పాఠశాల స్థాయి చెకుముకి సైన్స్ సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెకుముకి సైన్స్ సంబరాలు రాష్ట్రవ్యాప్తంగా గత 34 ఏళ్లుగా జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నామన్నారు. పాఠశాల స్థాయి సంబరాలలో విజేతలకు బహుమతులు అందజేశారు. పాఠశాల చెకుముకి కన్వీనర్ ఎన్. దుర్గాప్రసాద్ మాట్లాడుతూ జి.రవికిరణ్, వి.ఎలీజా నవోమి, బి.సంతోష్‌కుమార్, భీమవరం మండలస్థాయి చెకుముకి సైన్స్ సంబరాలకు ఎంపికైనట్టు తెలిపారు. ఉపాధ్యాయులు వి.మెర్సీ నిర్మలకుమారి, జి.నర్మద, డి.అనురాధ, కె.రాజేష్‌కుమార్‌రాజు, జీఎస్ విజయలక్ష్మి, సీహెచ్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్ అజీజ్‌కు అభినందనలు

ఆకివీడురూరల్ సెప్టెంబరు 25 : రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్‌గా నియమింపబడ్డ అబ్దుల్ అజీజ్‌ను ఆకివీడు మైనారిటీ నాయకులు అభినందించారు. బుధవారం అమరావతిలో ఆయనను కలిసి దుశ్శాలువాతో సత్కరించారు. సీఎం చంద్రబాబునాయుడు ఆదేశాలతో ముస్లిం మైనారిటీల అభివృద్ధికి పాటుపడతానని ఆయన తెలిపారన్నారు. రాష్ట్ర మైనారిటీ నాయకులు ఎండి. జాకీర్, జిల్లా మైనారిటీ నాయకులు అజమాల్, ఆరీఫ్, సిరాజుద్దీన్ తదితరులున్నారు.

న్యాయం చేయాలని ప్రభుత్వాసుపత్రి వద్ద ధర్నా

భీమవరం క్రైం, సెప్టెంబరు 25 : ఏఎంసీ చెక్‌పోస్టులో పనిచేస్తూ విధుల్లో ఉండగా లారీతో ఢీకొట్టి మృతికి కారణమైన లారీ డ్రైవర్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని మృతి చెందిన వ్యక్తి కుటుంబానికి న్యాయం చేయాలని మృతుడి బంధువులు భీమవరం ప్రభుత్వాసుపత్రి వద్ద నిరసన వ్యక్తం చేశారు. భీమవరం పట్టణానికి చెందిన సాల వెంకటేశ్వరరావు (48) ఈనెల 24వ తేదీ సాయంత్రం ఉండి రోడ్‌లోని పెద అమిరం గ్రామ సమీపంలో ఉన్న చెక్‌పోస్టు వద్ద విధులు నిర్వహిస్తున్నాడు. ఓ రొయ్యల కంపెనీ లారీ ఢీకొట్టడంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న బంధువులు పెద్దఎత్తున భీమవరం ప్రభుత్వాసుపత్రి వద్ద నిరసన వ్యక్తం చేశారు. భీమవరం డీఎస్పీ జయసూర్య ఆధ్వర్యంలో సీఐ నాగరాజు, కాళ్ళ ఎస్ఐ వెంకటేశ్వరరావు ఆందోళన కారులతో మాట్లాడారు. బుధవారం రాత్రికి నిరసన విరమించి మృతదేహాన్ని బంధువులు తీసుకువెళ్ళినట్లు పోలీసులు తెలిపారు.

హాస్టల్ విద్యార్థులను సొంత పిల్లల్లా భావించాలి

తాడేపల్లిగూడెం రూరల్, సెప్టెంబరు 25: హాస్టల్ విద్యార్థులను సొంత పిల్లల్లా భావించాలని జేసీ టి.రాహుల్‌కుమార్ రెడ్డి పేర్కొన్నారు. తాడేపల్లిగూడెం గొల్లగూడెం సెంటర్‌లోని బీసీ బాలికల వసతిగృహాన్ని బుధవారం ఆయన పరిశీలించి వసతిగృహంలో సౌకర్యాలు, వసతిపై విద్యార్థినులను వ్యక్తిగతంగా ఆరా తీశారు. మరుగుదొడ్లు సరిగా లేవని, వేరే చోటకు హాస్టల్ మార్చాలని, భోజనం నాణ్యతను స్థానిక అధికారులు పరిశీలించాలని సూచించారు. స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ బి.శివన్నారాయణరెడ్డి, తహసీల్దార్ సునీల్‌కుమార్, బీసీ సంక్షేమ శాఖ జిల్లా అధికారి జీవీఆర్ గణపతి, సహాయ సంక్షేమ అధికారి కె. వెంకటేశ్వరరావు, ఇన్‌చార్జ్ కమిషనర్ మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వీరంపాలెంలో దసరా ఉత్సవాలు

తాడేపల్లిగూడెం రూరల్, సెప్టెంబరు 25: తాడేపల్లిగూడెం మండలం వీరంపాలెం బాలాత్రిపుర సుందరి పంచాయతన క్షేత్రంలో అక్టోబరు 3 నుంచి 13 వరకు దసరా ఉత్సవాలు నిర్వహించనున్నట్టు ఆలయ వ్యవస్థాపకుడు గరిమెళ్ల వెంకటరమణ సిద్ధాంతి బుధవారం తెలిపారు. క్షేత్రంలో పదిరోజుల పాటు నిత్యపూజలు నిర్వహిస్తారని నవరాత్రుల్లో విశేషాలంకరణలు చేయనున్నామన్నారు. ప్రతిరోజూ మధ్యాహ్నం 3 నుంచి రాత్రి 8 గంటల వరకూ సంపూర్ణ చండీ హోమం కొనసాగించనున్నట్టు వివరించారు.

ఆకివీడు లయన్స్ క్లబ్‌ల సేవలు అభినందనీయం

ఆకివీడు రూరల్, సెప్టెంబరు 25 : ఆకివీడులోని లయన్స్ క్లబ్‌లు సేవలు అభినందనీయమని లయన్స్ క్లబ్ జిల్లా గవర్నరు కాకరాల వేణుబాబు అన్నారు. చెరుకుమిల్లిలోని మంతెన దుర్గరాజు జడ్పీ పాఠశాల ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. మాజీ గవర్నరు కృష్ణరాజు, పడవలరాజు, దాట్ల రామరాజు, రాజేశ్వరి, జ్యోతిరెడ్డి, జేవీఎస్, సర్పంచ్ ప్రకాష్, వైస్ ఎంపీపీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సూపర్ సిక్స్ హామీలు అమలు చేయాలి

భీమవరంటౌన్, సెప్టెంబరు 25 : సూపర్ సిక్స్ హామీలను అమలు చేయాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పాతపాటి హరికుమార్‌రాజు డిమాండ్ చేశారు. భీమవరంలో కలెక్టరేట్ వద్ద కాంగ్రెస్ పార్టీ నాయకులు థాలీ బజావో అంటూ నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం హామీల్లో ఒక్క హామీ కూడా పూర్తి చేయలేదని, హామీలను మర్చిపోవడానికే ఇది మంచి ప్రభుత్వమని, ప్రజలను పక్క దోవ పట్టిస్తున్నారని విమర్శించారు. జిల్లా యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు సోము నాగకేశవబాబు, బోణం రవికుమార్, గోపాలకృష్ణంరాజు, తదితరులు ఉన్నారు.

మార్చి 31లోపు గృహనిర్మాణాలు పూర్తి చేయాలి

గణపవరం, సెప్టెంబరు 25: ప్రభుత్వం కేటాయించిన స్థలాల్లో వచ్చే ఏడాది మార్చి నెలాఖరుకు గృహనిర్మాణాలు పూర్తి చేయాలని తాడేపల్లిగూడెం హౌసింగ్ డీఈ ప్రసాద్ కోరారు. బుధవారం గణపవరం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో సూర్యనారాయణ అధ్యక్షతన సంబంధిత అధికారుల తో సమావేశం నిర్వహించారు. నిర్మాణాలు పూర్తి చేసిన లబ్ధిదారులకు కేంద్ర ప్రభుత్వం అందించే రుణం లబ్ధిదారుల ఖాతాలో పడతాయని డీఈ తెలిపారు. గృహ నిర్మాణాలు పూర్తి చేయలేని తరుణంలో కేంద్ర ప్రభుత్వం ఇచ్చే రుణం వెనక్కి వెళ్లిపోయే అవకాశం ఉందన్నారు. ఈనెల 28న మన ఇల్లు- మన గౌరవం అనే కార్యక్రమం ప్రతీ గ్రామంలో నిర్వహించాలని కోరారు. సమావేశంలో ఏఈ కే.కిరణ్ కుమార్, ఏపీఎం రాజేష్ అధికారులు పాల్గొన్నారు.

గ్రామాల సమగ్రాభివృద్ధికి కృషి : ఎమ్మెల్యే బొలిశెట్టి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొలిశెట్టి

తాడేపల్లిగూడెం రూరల్, సెప్టెంబరు 25: గత ప్రభుత్వం విచ్ఛిన్నం చేసిన గ్రామాల సమగ్రాభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వలవల బాబ్జి పేర్కొన్నారు. మండలంలోని కొత్తూరులో ఇది మంచి ప్రభుత్వం, అప్పారావుపేటలో పొలం పిలుస్తోంది కార్యక్రమాల్లో వారు పాల్గొన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ ఏడాది జూలైలో భారీ వర్షాలకు 1086 హెక్టార్లలో పంట నష్టం జరిగిందని 2297 మంది రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ అందించేందుకు ప్రతిపాదనలు పంపామన్నారు. పౌష్టికాహార మాసోత్సవాల సందర్భంగా గర్భిణులకు సీమంతాలు కార్యక్రమంలో వీరు పాల్గొన్నారు. రూ.40 లక్షలతో నిర్మించనున్న నవాబుపాలెం-జగన్నాథపురం రహదారికి శంకుస్థాపన చేశారు. జగన్నాథపురం-మాధవరం రోడ్డు నిర్మాణానికి రూ.40 లక్షలు మంజూరు చేస్తున్నట్టు ప్రకటించారు. ఏడీఏ పి.మురళీకృష్ణ, ఎంపీడీవో విశ్వనాథ్, సర్పంచ్‌లు కూడవల్లి హనుమంతు, ఆరుగొల్లు శ్రీనివాస్, ఎంపీటీసీ ఉప్పు నరసింహమూర్తి, జనసేన, టీడీపీ మండల అధ్యక్షులు పరిమి రవికుమార్, అడపా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ సభ్యత్వ నమోదులో నరసాపురం ఫస్ట్



సభ్యత్వ నమోదు చేస్తున్న బీజేపీ నాయకులు

నరసాపురం రూరల్, సెప్టెంబరు 25: జిల్లాలో ఇప్పటి వరకు బీజేపీ సభ్యత్వ నమోదులో నరసాపురం మొదటి స్థానంలో ఉందని ఆ పార్టీ కన్వీనర్ మేకల సతీష్ తెలిపారు. బుధవారం మల్లవరం లంక గ్రామంలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటివరకు నియోజకవర్గంలో పది వేల సభ్యత్వాలను నమోదు చేశామన్నారు. వ్యక్తిగతంగా మూడు వేల సభ్యత్వాలు చేయించానన్నారు. గడువు ముగిసేలోపు మరో ఐదు వేలు చేయించాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. గ్రామాల కంటే పట్టణంలోనే అత్యధిక సభ్యత్వ నమోదు జరిగిందన్నారు. నడిపూడి పండు, బాల వెంకటేశ్వర్లు, శ్రీను పాల్గొన్నారు.

సన్‌షైన్ జేపీకి డైనమిక్ స్కూల్ అవార్డు



అవార్డు అందుకుంటున్న సన్‌షైన్ జేపీ

నరసాపురం, సెప్టెంబరు 25: పట్టణంలో ప్రసిద్ధిగాంచిన సన్‌షైన్ విద్యా సంస్థల ఫౌండర్ జె.ప్రసాద్(జేపీ)కి డైనమిక్ స్కూల్ అవార్డు లభించింది. గత 42 ఏళ్లుగా విద్యా రంగానికి ఆయన చేస్తున్న సేవలు, పేద విద్యార్థులకు అందిస్తున్న రాయితీలు, విద్యా ప్రమాణాలను పరిగణనలోకి తీసుకుని ఈ-న్యూస్ నెట్‌వర్క్ అనే సంస్థ బుధవారం హైదరాబాద్‌లో ఈ అవార్డును ప్రదానం చేసింది. ఆయనకు అవార్డు లభించడం పట్ల పలువురు అభినందనలు తెలిపారు.